
# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - బుధవారం 5 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 212 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


18 ఏండ్ల ప్రొఫెసర్



2

శిర్డీ సాయినాథునికి బంగారు అక్షరాల

ఓం సాయి రామ్ కానుక



2

## జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి

### ప్రధాని వీడియో తొలగింపుపై పార్లమెంటు స్థాయీ సంఘం డిమాండ్




ఢిల్లీ, ఆగష్టు 4: ప్రధాని మోడీ వీడియోను ఫేస్‌బుక్ నుంచి తొలగించినందుకు మెటా అధినేత జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని ఐటీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యక్షుడు నిశికాంత్ దుబే డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు స్థాయీ సంఘం సభ్యులు కోరారు. గూగుల్, మెటా, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమ సంస్థల ప్రతినిధులు సోమవారం పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫేస్‌బుక్ పోస్ట్‌ను మెటా గ్లోబల్ టీమ్ కొన్ని క్షణాల పాటు నిలిపివేసిన నేపథ్యంలో ప్రభుత్వం వారికి గత వారం సమన్లు జారీ చేసింది. ఆ ఫేస్‌బుక్ పోస్ట్‌లో ప్రధాని మోడీ పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పోస్ట్‌ను నిలిపివేసిన నేపథ్యంలో జరిగిన ఆ సమావేశంలో కేంద్ర హోం, ఐటీ శాఖల ప్రతినిధులతోపాటు స్నాప్‌చాట్, గూగుల్, ఎక్స్ (గతంలో ట్విట్టర్),

...మిగతా 2లో

## దివంగత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహణ

పాల్గొన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

మండలి వెంకటకృష్ణారావు ఆశయాలను కొనసాగిస్తామని వెల్లడి



2



## విధ్వంసం నుంచి వికాసం వైపు

# అంతర్జాతీయ స్థాయికి ఆంధ్రప్రదేశ్

## రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు రిపోర్ట్

■ పి.మీరాహుస్సే ఖాన్

**అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి):** నవ్యాంధ్ర అంతర్జాతీయ స్థాయిలో బ్రాండ్ ఇమేజ్ తో అభివృద్ధి పథం లో పయనిస్తోంది అని ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రెస్ మీట్లో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ ఆర్థిక అరాచకాలపై తాము విడుదల చేసిన శ్వేతపత్రాల ఆధారంగా, ఈ రెండేళ్లలో సాధించిన పురోగతిపై 10 రకాల 'ప్రోగ్రెస్ రిపోర్ట్లను' ప్రజల ముందుకు తెస్తున్నట్లు చెప్పారు. తీవ్ర ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, సంక్షేమం , సంస్కరణలను సమపాళ్లలో అందిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తెచ్చామని సీఎం వెల్లడించారు'. జూన్ 4, 2024 నాటి ప్రజా తీర్పు చారిత్రాత్మకమైనదని, రెండేళ్లలో రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెట్టామని సీఎం పేర్కొన్నారు. ఆర్థిక, విద్యుత్, రాజధాని అమరావతి, పోలవరం వంటి కీలక రంగాలపై ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించేందుకు 10 ప్రత్యేక నివేదికలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు.ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ: గత ప్రభుత్వ హయాంలో తగ్గిన జీఎస్డీపీ వృద్ధిరేటును అధిగమించి, ప్రస్తుతం 13.5 శాతం వృద్ధి రేటు సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించామని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనుల పురోగతి ఇందుకు నిదర్శనమని చెప్పారు. అమరావతిని ఏకైక రాజధానిగా కేంద్రం గుర్తించిందని, ఇటీవల కేంద్రం విడుదల చేసిన పన్నుల వాటా నిధులు రాష్ట్ర అభివృద్ధికి మరింత ఊతమిస్తాయని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నామని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఇప్పటికే నాలుగింటిని విజయవంతంగా అమలు చేశామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని, ఫేక్ న్యూస్ను తిప్పికొట్టడమే ఈ ప్రోగ్రెస్ రిపోర్టుల ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. అభివృద్ధి పై సీఎం వివరిస్తూ..ఆదాయం

...మిగతా 2లో

డబుల్ ఇంజిన్ సర్కార్...

**సంక్షేమం-అభివృద్ధి బ్యాలెన్స్**

సీఎం చంద్రబాబు ప్రెజెంటేషన్ 2

**గత ప్రభుత్వ విధ్వంసం నుంచి నవ్యాంధ్రను రెండేళ్లలోనే వికాసం వైపు నడిపించామని, బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ను అంతర్జాతీయ స్థాయిలో పునరుద్ధరించామని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 13.5 శాతం వృద్ధి రేటు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు.**

## మంత్రి చేతుల మీదుగా అమరావతి చిత్రకళా వీధి పోస్టర్ ఆవిష్కరణ

ఆగస్టు 8, 9 తేదీల్లో గుంటూరులో ప్రతిష్టాత్మకంగా 'అమరావతి చిత్రకళా వీధి'

ఈ కళా ఉత్సవం ద్వారా కళాకారుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యమని పేర్కొన్న మంత్రి దుర్గేష్

ఆంధ్రప్రదేశ్ అతిపెద్ద కళా ఉత్సవం 'అమరావతి చిత్రకళా వీధి'లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు




విజయవాడ,ఆగస్టు,04,(మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న 'అమరావతి చిత్రకళా వీధి' ఉత్సవానికి సంబంధించిన పోస్టర్ ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విజయవాడలోని తమ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని, కళాకారుల సృజనాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ భారీ కళా ఉత్సవాన్ని రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఆగస్టు 8 మరియు 9 తేదీలలో (శని, ఆదివారాలు) ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని కొరిటేపాడు - విద్యానగర్ రోడ్డులో ఈ కళా ఉత్సవం జరుగుతుందన్నారు. ఇందులో ప్రధానంగా సందర్శకులు స్వేచ్ఛగా తిలకించేలా ప్రత్యేక సాంస్కృతిక వీధి నిర్మాణం, దేశం నలుమూలల నుండి విచ్చేసే వివిధ రకాల చిత్రకళా ఉత్పత్తులు, హస్తకళల ప్రదర్శన మరియు విక్రయాలకోసం

...మిగతా 2లో

## అమరావతిలో కీలకమైన అభివృద్ధి పనులకు సీఆర్డీఏ అథారిటీ అనుమతులు మంజూరు



- క్వాంటం ఫెసిలిటీ ప్రాజెక్టు టెండర్ దక్కించుకున్న ఔఖీ సంస్థ
- విజయవాడ నుండి అమరావతి టిటిడీ దేవస్థానం వరకు ఐకానిక్ రోప్ వే
- హ్యాపీనెస్ట్ కొనుగోలు దారులకు భారీ ఊరట
- కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి అధ్యాయనానికి అనుమతులు
- అమరావతిలో నిర్మించే ప్రభుత్వ భవనాలు రాష్ట్ర సంస్కృతి,సాంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్ణయం

2



## నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూత

ముంబై, ఆగష్టు 4: ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ (74) కన్నుమూశారు. ముంబయిలోని నివాసంలో గుండెపోటుతో ఆయన మృతిచెందారు. తెలుగుతో పాటు వివిధ భాషల్లో ఆయన నటించారు. సై, ఛత్రపతి, గజిని చిత్రాల్లో పోషించిన ప్రతినాయకుడి పాత్రలు ఆయనకు మంచిపేరు తీసుకొచ్చాయి.

## కోతలు లేని వైద్య విప్లవం

'ఇంటర్వెన్షనల్ రేడియాలజీ'తో జటిల రోగాలకు చెక్!

చిన్న సూది రంధ్రంతోనే క్లిష్టమైన వ్యాధులకు అత్యంత ఖచ్చితమైన చికిత్స

తక్కువ నొప్పి, శూన్య రక్తస్రావంతో వేగంగా కోలుకునే అరుదైన అవకాశం

క్యాన్సర్ కణుతులు, ఫైబ్రాయిడ్లు, వెరికోస్ వెయిన్స్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

గుంటూరులో వివరాలు వెల్లడించిన సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి వైద్య నిపుణులు




2

## రెండేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో తీసుకెళ్తున్నాం



● రాష్ట్ర మంత్రి టీజీ భరత్

కర్నూలు, ఆగస్ట్ 04మనం న్యూస్: రెండేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా చెప్పారు. కర్నూలు నగరంలోని 6వ వార్డులోని కమేలా వద్ద నుండి ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రజలను కలిశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల కాలంలో చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం

...మిగతా 2లో



## విశాఖ-బెంగళూరు మార్గాన వందేభారత్ స్లీపర్ రైలు సేవల పట్ల హర్షం

శ్రీశైలం కు దగ్గరగా ఉన్న మార్కాపురంలో స్టాప్ కల్పించాలని కేంద్ర రైల్వే శాఖకు విజ్ఞప్తి

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

మార్కాపురం,ఆగస్టు,04,(మనం న్యూస్): విశాఖపట్నం-బెంగళూరు మధ్య ప్రయాణించే ప్రయాణికులకు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మరో శుభవార్త అందించిందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్

...మిగతా 2లో




## ప్రజా పోరాటాలతోనే ఈ 20 నుంచి విముక్తి

ఇథనాల్ పెట్రోల్‌పై అరవింద్ కేజ్రీవాల్

ఢిల్లీ, ఆగష్టు 4: ఈ 20 ఇంధన విధానానికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనను దేశవ్యాప్తంగా మరింత ఉద్ధృతం చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. దీని నుంచి దేశ ప్రజలకు విముక్తి కలగాలంటే వందల మంది సరిపోరని.. పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి పోరాడాలని

...మిగతా 2లో

ఆర్థిక ఇబ్బందులతో అష్టకష్టాలు

## జుట్టు, వ్యక్తిగత వస్తువులు అమ్ముకుంటున్న ఇరానీయులు

యుద్ధం కారణంగా పెరిగిన ద్రవ్యోల్బణం.. క్షీణించిన ప్రజల కొనుగోలు శక్తి



టెహ్రాన్, ఆగష్టు 4: అమెరికాతో దాదాపు ఆరునెలలుగా కొనసాగుతోన్న యుద్ధం కారణంగా ఇరానీయులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, క్షీణిస్తున్న కొనుగోలు శక్తితో పేద కుటుంబాలు సతమతమవుతున్నాయి. మనుగడ కోసం అనేక మార్గాలు అన్వేషిస్తున్న ప్రజలు.. తల వెంట్రుకలు, పర్ఫ్యూమ్ బాటిళ్లు, వ్యక్తిగత, వాడుక వస్తువులను విక్రయిస్తున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. అంతేకాదు, వ్యక్తిగత వస్తువులనూ అద్దెకు ఇస్తున్నట్లు సమాచారం

...మిగతా 2లో

## సూకీ సజీవంగానే ఉన్నారు!

ఫొటోలు విడుదల చేసిన మయన్మార్ ప్రభుత్వం

బ్యాంకాక్, ఆగష్టు 4: మయన్మార్ మాజీ అధినాయకురాలు ఆంగ్ సాన్ సూకీ జీవించే ఉన్నారని తెలిపే

...మిగతా 2లో



# డబుల్ ఇంజిన్ సర్కార్.. సంక్షేమం-అభివృద్ధి బ్యాలెన్స్

## సీఎం చంద్రబాబు ప్రెజెంటేషన్

**అమరావతి,ఆగస్టు 4(మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** విభజన నాటి కంటే 2019-24 మధ్యన జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నష్టపోయిందని, ఈ సమస్యను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తన జీవితంలో ఎన్నడూ పడనంత కష్టాన్ని గత రెండేళ్లల్లో పడ్డానని తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని మొత్తంగా గాడిలో పెట్టేశామని చెప్పడంలేదన్న సీఎం... రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించేలా పోయిన బ్రాండ్ను ఎస్టాబ్లిష్ చేశామన్నారు. ఆర్థిక వెసులుబాటు లేకున్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వ్యయాలు.. ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలు ప్రజలకూ తెలియాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా కాన్ఫరెన్స్లో రెండేళ్ల ఆర్థిక స్థితిగతులపై సీఎం చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్ ప్రజెంట్ చేశారు. 2019-24 మధ్య రాష్ట్రంలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, ప్రజలు, అధికారులు, ఉద్యోగులు భయపడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఆ పాలనపై ప్రజల్లో వచ్చిన నిశ్శబ్ద విప్లవమే 2024 ఎన్నికల ఫలితాలని చెప్పారు. 2024 ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, బ్రాండ్ ఏపీని తిరిగి తీసుకొస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని సీఎం అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. చెప్పిన విధంగా.. ఇచ్చిన తేదీల్లో సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. సంక్షేమంతో పాటు రాష్ట్రానికి ఆదాయం సమకూర్చే అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రజలు కూడా అభివృద్ధిలో ఏ స్థాయిలో భాగస్వాములు అవుతారో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం చాటిచెప్పిందని ముఖ్యమంత్రి అన్నారు. భోగాపురం ఎయిర్పోర్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి రెక్కలు వచ్చిన భావన ప్రజల్లో ఏర్పడిందన్నారు. ఉత్తరాంధ్రను అంతర్జాతీయ అవకాశాలకు గేట్వేగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. దీన్ని ప్రజలు గ్రహించారు కాబట్టే... ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి ప్రజల నుంచి చక్కటి మద్దతు లభించిందని ముఖ్యమంత్రి అన్నారు. పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టులు చేపడుతుంటే వ్యతిరేకించిన వారు... అదే పీపీపీ పద్ధతిలో చేపట్టిన భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ క్రెడిట్ మాత్రం తమదని చెప్పుకుంటున్నారని సీఎం విమర్శించారు. పెట్టుబడులు వస్తే పరిశ్రమలు వస్తాయని.. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు, ఆదాయం పెరుగుతాయని.. ఆదాయం పెరిగితే మరింత సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

### గుంతల రోడ్లు.. గుదిబండ అప్పులు

2019-24 మధ్య రాష్ట్రాన్ని విషవలయంలోకి నెట్టారని... రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతోపాటు అభివృద్ధి వేగాన్ని నిలిపివేశారని అన్నారు. ఆదాయాలు తగ్గి.. ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో అప్పులు పెంచుకుంటూ వెళ్లారని, చివరకు రాష్ట్రం దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. 2019లో పరిపాలన ప్రారంభించిన తీరు ప్రజా వేదిక కూల్చివేతతోనే స్పష్టమైందని పేర్కొన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ పెట్టి మరీ ప్రజా వేదికను కూల్చారు. దీన్ని గర్వం అనాలా..? మదం అనాలా..? దీనికి పేరే లేదేమో..? అని సీఎం ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాలనలో విధానపరమైన నిర్ణయాల కంటే విధ్వంసకర చర్యలకే గత ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు. 2019-24 మధ్య రాష్ట్రాన్ని అన్ని విధాలుగా వెనక్కి నెట్టారని సీఎం అన్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో పురోగతి ఆగిపోయిందని, రోడ్ల నిర్వహణ సరిగాలేక గుంతలమయంగా మారాయని తెలిపారు. శాంతిభద్రతల పరిస్థితి దెబ్బతినడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం తగ్గిందన్నారు. పరిశ్రమలు రావాల్సిన చోట ఉన్నవి కూడా వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని, కొత్త పెట్టుబడులు లేకుండా పోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం తీవ్రంగా దిగజార్చిందని చంద్రబాబు విమర్శించారు. నాటి ప్రభుత్వ నిర్వాకం వల్ల అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు చేరాయని, అప్పులు తీర్చే సామర్థ్యం లేని రాష్ట్రంగా నీతి ఆయోగ్ పేర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆదాయాలు తగ్గుతున్నా ఖర్చులు మాత్రం పెరిగాయని, ప్రభుత్వ ఆస్తులు, భూములను తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చారని ఆరోపించారు. రాష్ట్రం దివాళా తీసే స్థాయికి చేరడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

### కేంద్ర నిధులూ దారి మళ్లించారు

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన పథకాల నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించిందని సీఎం ఆరోపించారు. కేంద్ర నిధుల వినియోగంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానం కారణంగా కేంద్రం ప్రత్యేకంగా చట్టం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. కేంద్రం ఇచ్చే నిధులను నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించేలా వ్యవస్థను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాటి ప్రభుత్వం... చివరకు మద్యం ఆదాయాన్ని ముందుగానే తాకట్టు పెట్టి రూ.25 వేలకోట్లు అప్పులు తెచ్చిందని చంద్రబాబు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీకి పూర్తి భిన్నంగా మద్యం ఆదాయాన్ని ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు ఉపయోగించారని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో కీలకంగా మారిందని సీఎం తెలిపారు. వెంటిలేటర్పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకుందని వ్యాఖ్యానించారు. కేంద్రం అందిస్తున్న సహకారాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని చెప్పారు. కేంద్రం సాయం అందిస్తే దాన్ని అందిపుచ్చుకుని అభివృద్ధిగా మలచుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలు ఇచ్చిన ఓట్లతోనే ఇదంతా చేయగలుగుతున్నామని చంద్రబాబు అన్నారు. డిసెంబరులో క్వాంటం వ్యాలీని ప్రారంభిస్తామని, 2028లో అమరావతి ఫేజ్-1ను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని సీఎం స్పష్టం చేశారు. పోలవరంతోనే ఆగకుండా రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రూ.37,766 కోట్లతో 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఏపీలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని... ట్రిపుల్ రీజియన్ ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖ కేంద్రంగా ఎకనమిక్ రీజియన్ల వారీగా అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు.

### టెక్నాలజీని అడ్డుకోవద్దు

గతంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐయస్బి)ను రాష్ట్రానికి తీసుకొచ్చామని, ఇప్పుడు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐయస్ఏ) ను ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. ఐయస్ఏ ఏర్పాటుకు రిలయన్స్ ముందుకొచ్చిందని వెల్లడించారు. డేటా సెంటర్లు వస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మాకెందుకు స్టీల్ ప్లాంట్.. మాకెందుకు ఏఐ.. మాకెందుకు డేటా సెంటర్లు అంటూ పేదరికంలోనే బాధపడాలా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు, ప్రజలకు ఆదాయం, రాష్ట్రానికి సంపద తీసుకొచ్చే పరిశ్రమలు, సాంకేతిక రంగాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల జీవితాలను మార్చేలా పబ్లిక్ పాలసీలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. సంక్షేమం ఎంత ముఖ్యమో.. అభివృద్ధి కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. మంచి రోడ్లు వేయాలన్నా.. మౌలిక వసతులు కల్పించాలన్నా.. సంపద సృష్టించాల్సిందేనని తెలిపారు. సంపద సృష్టికి కొత్త మార్గాలను అన్వేషించడంతోపాటు.. పెట్టుబడులను ఆకర్షించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలని ఆకాంక్షించారు. పరిశ్రమలు వస్తే ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వస్తుందో కియా కార్ల పరిశ్రమను ఉదాహరణగా సీఎం ప్రస్తావించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం వల్లే ప్రజలు ప్రభుత్వాన్ని నమ్ముతున్నారని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## ప్రజా పోరాటాలతోనే ఈ 20 నుంచి విముక్తి

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈ20 ఇంధన విధానానికి వ్యతిరేకంగా సేకరించిన దాదాపు 2.30 లక్షల వినతి పత్రాలతో మంగళవారం ప్రధానమంత్రి నివాసం వైపు ప్రదర్శనగా వెళ్తున్న కేజ్రీవాల్, ఆప్ నాయకులను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ఫిరోజ్ షా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తాము సేకరించిన వినతి పత్రాలను ప్రధానికి అందిస్తామని.. తమ వినతిని పీఎంఓకు చేరవేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో ఆప్ ఎమ్మెల్యేలు ఉన్నారు. అక్కడ కూడా ఈ 20 విధానాన్ని వ్యతిరేకిస్తాం. పార్లమెంటులో ఈ అంశాన్ని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ప్రస్తావించగా ఈ 20 అమలుకే మొగ్గుచూపుతున్నట్లు కేంద్రం నుంచి సమాధానం వచ్చింది. ఈ విధానం వల్ల భారత రైతులకు కాకుండా అమెరికా రైతులకు లాభం చేకూరుతుంది. అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులు నిలిపివేసి భారత రైతుల ప్రయోజనాలను కాపాడాలి'' అని ఆయన డిమాండ్ చేశారు.

# విశాఖ-బెంగళూరు మార్గాన వందేభారత్ స్లీపర్ రైలు సేవల పట్ల హర్షం

(మొదటి పేజీ తరువాయి)

ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో వందేభారత్ స్లీపర్ రైలు సేవలు ప్రారంభం కానుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయ రైల్వే వ్యవస్థను ఆధునికీకరిస్తూ, ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సేవలను అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందన్నారు. వందేభారత్ స్లీపర్ రైలు సేవలు ప్రారంభం కావడం వల్ల విశాఖపట్నం-బెంగళూరు మధ్య ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, సాధారణ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ నూతన రైలు సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే, దేశ రైల్వే రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ ఆధునిక రవాణా సౌకర్యాలను విస్తరిస్తున్న ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన కేంద్ర రైల్వే శాఖకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం-బెంగళూరు వందేభారత్ స్లీపర్ రైలుకు ప్రకాశం జిల్లా కేంద్రం మార్కాపురంలో స్టాప్ కల్పించాలని కోరారు. మార్కాపురం ప్రాంత ప్రజలతో పాటు, శ్రీశైలం క్షేత్రానికి వెళ్లే వేలాది మంది భక్తులకు ఈ స్టాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మార్కాపురం రైల్వే స్టేషన్కు ఈ రైలు నిలుపుదల కల్పిస్తే ప్రకాశం, నంద్యాల పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి అభిప్రాయపడ్డారు.

# అంతర్జాతీయ స్థాయికి ఆంధ్రప్రదేశ్

(మొదటి పేజీ తరువాయి)

రావాలన్నా అభివృద్ధి జరగాలన్నా పెట్టుబడులు రావాలి. ఉమ్మడి రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ.95,231గా ఉంది. విభజన తర్వాత తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104గా ఉంది... ఏపీ రూ.93,903కు పడిపోయింది. రెండు రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో రూ.30,201 గ్యాప్ ఏర్పడింది. రాజధానిని కోల్పోవడం వల్ల, ఎక్కువ జనాభా, తక్కువ ఆదాయ వనరులతో రాష్ట్రం ఏర్పడడంతో ప్రజల తలసరి ఆదాయం తగ్గిపోయింది. ఈ పరిస్థితి నుంచి అభివృద్ధి చేసేందుకు కష్టపడ్డాం.ఇలాంటి పరిస్థితులు ఉండగానే 30.5 శాతం మేర సీఏజీఆర్ వృద్ధి జరిగింది... ఇది చారిత్రాత్మకం. జీఎస్డీపీ 13.5 శాతంగా ఉంది. అప్పుల జీఎస్డీపీ రేషియో 28.38 శాతంగా ఉంది. అభివృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగాం కాబట్టి.. ఏపీ, తెలంగాణల మధ్య ఉన్న రిసోర్స్ గ్యాప్ 10 శాతం నుంచి 8 శాతానికి తీసుకురాగలిగం. 2 శాతం మేర గ్యాప్ తగ్గించాం. ఎవ్వరూ ఊహించని విధంగా చెప్పిన విధంగా.. చెప్పిన తేదీల్లో సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం...అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## జుట్టు, వ్యక్తిగత వస్తువులు అమ్ముకుంటున్న ఇరానీయులు

(మొదటి పేజీ తరువాయి)

వెలువడుతోంది. యుద్ధం వేళ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు.. ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను విక్రయిస్తున్నారు. శిరోజాలు అమ్ముకోవడం, ఉపయోగించిన పర్ఫ్యూమ్ బాటిళ్లు, షూలు, దుస్తులు.. తదితర వస్తువులను ఆన్ లైన్లో అమ్మకానికి పెడుతున్నారు. పొడవైన జుట్టు (రంగు, నాణ్యతను బట్టి) వేలాది ఇరాన్ రియాల్స్ పలుకుతోంది. ల్యాప్ టాపులున్న వారు వాటిని అద్దెకిస్తున్నారు. ఈ అమ్మకాలకు సంబంధించి ఆన్ లైన్ లోనూ ప్రకటనలు విరివిగా ఇస్తున్నారు.

అంతర్జాతీయ ఆంక్షలు, అంతర్గత సమస్యలను ఎదుర్కొంటున్న ఇరాన్లో ఇటీవల ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరగడంతో అక్కడి ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. అధికారిక గణాంకాల ప్రకారం.. జులై చివరలో వార్షిక ద్రవ్యోల్బణం 66 శాతానికి ఎగబాకింది. సాధారణ గృహ వినియోగ ధరలు విపరీతంగా పెరిగాయి. తీవ్ర ద్రవ్యోల్బణంతో ఆహారమే కాకుండా ఇతర వస్తువులపై ఖర్చులను తగ్గించుకుంటున్నారు. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, ఔషధాలకయ్యే ఖర్చులను కూడా వాయిదాల్లో చెల్లిస్తున్నారని స్థానిక మీడియాల్లో కథనాలు వస్తుండడమం గమనార్హం.

# అమరావతిలో కీలకమైన అభివృద్ధి పనులకు సీఆర్డీఏ అథారిటి అనుమతులు మంజూరు

**అమరావతి,ఆగస్టు 04,(మనం ప్రత్యేక ప్రతినిధి):** రాజధాని అమరావతి ప్రాంతంలో కీలకమైన పలు అభివృద్ధి పనులకు సీఆర్డీఏ అథారిటీ అనుమతులు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖామంత్రి పి.నారాయణ తెలిపారు. మంగళవారం ఏపి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 64వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదించిన నిర్ణయాలను సచివాలయంలో నాల్గవ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర 64వ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ అథారిటీ సమావేశంలో అమరావతి రాజధాని పునర్నిర్మాణం, మౌలిక వసతులు,సాంకేతిక అభివృద్ధి,పర్యాటక రంగానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు.అమరావతిని గ్లోబల్ టెక్నాలజీ హబ్గా తీర్చిదిద్దే దిశగా రూ.1,280 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించనున్న క్వాంటం ఫెసిలిటీ ప్రాజెక్టు టెండర్ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ఆండ్టీ (లార్సన్ అండ్ టూబ్రో) దక్కించుకోగా, ఈ ప్రతిపాదనకు అథారిటీ అధికారిక ఆమోదం తెలిపిందని వివరించారు.

రాజధాని అనుసంధానానికి అత్యంత కీలకమైన ఇన్నర్ రింగ్ రోడ్డు మరియు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి భూమి సేకరించాల్సి రాగా, గుంటూరు జిల్లా మోతడక గ్రామస్థులు ముందుకు వచ్చి తమ గ్రామంలోని 2,344 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేయడంపట్ల అథారిటీ హర్షం వ్యక్తం చేసి ఆమోదముద్ర వేసిందన్నారు.విజయవాడ నగరంలో ట్రాఫిక్ రహిత రవాణాతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించేలా పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్షిప్ (పిపిపి) మోడల్లో విజయవాడ రైల్వే స్టేషన్ నుండి పండిట్ నెహ్రూ బస్ స్టాండ్ (పి.ఎన్.బి.యస్) వరకు, బస్టాండ్ నుండి ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వరకు, దుర్గమ్మ గుడి వద్ద నుండి కృష్ణా నది ఒడ్డున ఉన్న పున్నమి ఘాట్ వరకు అక్కడి నుండి భవాని ఐలాండ్ వరకు అక్కడి నుండి అమరావతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాయం వరకు ఐకానిక్ రోప్వే ప్రాజెక్టు చేపట్టనున్నామన్నారు. డిజిటల్ మౌలిక వసతులను వేగవంతం చేసేందుకు 20 మెగావాట్ల బృహత్తర సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు టెండర్లు పిలవడంతో పాటు, నగరమంతటా హై-స్పీడ్ నెట్వర్క్ అందించేందుకు 20 ప్రధాన ప్రాంతాల్లో 5ఎ టవర్ల ఏర్పాటుకు నివేదికల (ఆర్ఎఫ్పి) ఆహ్వానానికి సమ్మతించడం హర్షనీయమని మంత్రి నారాయణ పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో పక్కనపెట్టిన 'హ్యాపీనెస్ట్' హౌసింగ్ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిన నేపథ్యంలో ఆలస్యం వల్ల కొనుగోలుదారులపై అదనపు భారం పడకుండా ఏపీ రేరా (ఎపి రెరా) రెన్యూవల్ ఫీజు నుండి మినహాయింపును ఇవ్వాలని నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు.

## సూకీ సజీవంగానే ఉన్నారు!

(మొదటి పేజీ తరువాయి)

చిత్రాలను ప్రస్తుత సైనిక ప్రభుత్వం విడుదల చేసింది. ఆమె సోమవారం అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ ప్రతినిధుల్ని కలిసినట్టు తెలియజేసే చిత్రాలను దేశ అధ్యక్ష పత్రికా సమాచార బ్యూరో వెల్లడించింది. తన తల్లి బతికే ఉన్నట్టు తెలిపే సాక్ష్యం చూపండి అంటూ లండన్లో నివసిస్తున్న సూకీ చిన్న కుమారుడు కిమ్ యారిస్ చేపట్టిన ఆన్లైన్ ప్రచారం నేపథ్యంలో ఈ చిత్రాలు విడుదల కావడం విశేషం. 2021లో సైన్యం మయన్మార్ అధికారాన్ని కబళించిన నాటి నుంచీ నిర్బంధంలో ఉన్న సూకీ బయటి వ్యక్తుల్ని కలవడం ఓ అరుదైన ఘటన. అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ మయన్మార్ ప్రతినిధి అర్నౌద్ దె బేక్తో కరచాలనం చేస్తున్న రెండు చిత్రాలను పత్రికా సమాచార బ్యూరో విడుదల చేసింది. ఈ సమావేశం సోమవారం ఉదయం చోటు చేసుకుందని తెలిపిన బ్యూరో అది ఎక్కడ జరిగిందో వెల్లడించలేదు.

# కోతలు లేని వైద్య విప్లవం

**గుంటూరు, ఆగస్టు 4 (మనం న్యూస్ ప్రతినిధి):** వైద్య సాంకేతిక రంగంలో చోటుచేసుకుంటున్న నూతన ఆవిష్కరణలు రోగులకు గొప్ప ఊరటనిస్తున్నాయి. గతంలో క్లిష్టమైన శస్త్రచికిత్సల ద్వారా మాత్రమే సాధ్యమయ్యే అనేక తీవ్రమైన వ్యాధులకు ఇప్పుడు శరీర కోతలు లేకుండా, కేవలం ఒక చిన్న సూది రంధ్రం ద్వారా చికిత్స అందించే 'ఇంటర్వెన్షనల్ రేడియాలజీ' విధానం అందుబాటులోకి వచ్చింది. ఈ అత్యాధునిక చికిత్సా పద్ధతులపై గుంటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి సీనియర్ రేడియాలజీ నిపుణులు డాక్టర్ సంకేత్ కులకర్ణి పూర్తి వివరాలు వెల్లడించారు. అత్యాధునిక డిజిటల్ స్కాన్ పరికరాల సహాయంతో శరీరం లోపల ఉన్న వ్యాధిగ్రస్త భాగాన్ని అత్యంత కచ్చితత్వంతో గుర్తించి, నేరుగా అక్కడే చికిత్స అందించడం ఈ పద్ధతి ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.ఈ నూతన విధానం ద్వారా కాళ్లలోని రక్తనాళాల అడ్డంకులు, వెరికోస్ వెయిన్స్, మధుమేహం వల్ల పాదాలకు రక్తప్రసరణ తగ్గడం, గర్భాశయ ఫైబ్రాయిడ్లు, కాలేయం మరియు మూత్రపిండాల్లో ఏర్పడే కణుతులు,అసాధారణ రక్తస్రావం వంటి అనేక సమస్యలకు విజయవంతంగా పరిష్కారం లభిస్తోందని




వివరించారు. ముఖ్యంగా క్యాన్సర్ సంరక్షణలో కణుతులకు రక్త సరఫరాను నిలిపివేయడం, సంబంధిత ప్రాంతానికే నేరుగా మందులు చేరవేసి కణుతులను చిన్నవిగా చేయడం వంటి విధానాలు ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. పెద్ద కోతలు, కుట్లు ఉండవు కాబట్టి ఇన్ఫెక్షన్ల ప్రమాదం తగ్గి, రోగులు స్వల్ప వ్యవధిలోనే పూర్తి స్థాయిలో కోలుకుని సాధారణ జీవితంలోకి అడుగుపెట్టవచ్చని పేర్కొన్నారు.సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలోని అత్యుత్తమ రక్తనాళాల చికిత్సా విభాగం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సేవలు అందిస్తున్నామని తెలిపారు. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారు ప్రాథమిక దశలోనే రక్తనాళ పరీక్షలు చేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# దివంగత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహణ

**విజయవాడ,ఆగస్టు 4 (మనం ప్రతినిధి):** రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి (భాష, సాంస్కృతిక శాఖ), మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం మరియు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్త నిర్వహణలో దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ముగింపు వేడుకలు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేయగా, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా, విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు మరియు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రాంగణంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆధునిక ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సాంస్కృతిక, విద్యా రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..రాష్ట్ర అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు పెట్టడమే కాకుండా, ఆయన శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించడం ఎంతో సముచితం, గౌరవప్రదమని పేర్కొంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాష, సంస్కృతి, విద్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి మరియు సామాజిక సేవా రంగాల్లో మండలి వెంకట కృష్ణారావు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. నాడు విద్యాశాఖ మంత్రిగా మండలి వెంకట కృష్ణారావు తెచ్చిన విప్లవాత్మక సంస్కరణల ఫలితంగానే రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం పంతులు పేరిట ఒక కళాశాల, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి పేరిట మహిళా కళాశాలలు ఏర్పాటయ్యాయని, నేడు అవి ప్రఖ్యాత విద్యా కేంద్రాలుగా విలసిల్లుతున్నాయని గుర్తుచేశారు.తొలి ప్రపంచ తెలుగు మహాసభలను అత్యంత విజయవంతంగా నిర్వహించి, తెలుగు భాషకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన దిట్ట మండలి వెంకట కృష్ణారావు అని కొనియాడారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఆయన తనయుడు మండలి బుద్ధ ప్రసాద్ అదే బాటలో పయనిస్తుండటం ప్రశంసనీయమన్నారు. అలాగే తెలుగు భాషా వికాసానికి, ఉనికికి నిరంతరం కృషి చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయన భాషలో, ఆహార్యంలో తెలుగుదనం ఉట్టిపడుతుందని పేర్కొన్నారు.

మండలి వెంకట కృష్ణారావుతో పాటు ఎన్టీఆర్, వెంకయ్య నాయుడు, మండలి బుద్ధ ప్రసాద్ వంటి వారి కృషికి ధన్యవాదాలు తెలుపుతూ, తెలుగు భాషా వికాసానికి, సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. పద్య నాటకాలు, జానపద కళారూపాలను నేటి తరానికి అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. తాను సాంస్కృతిక శాఖ మంత్రిగా వెంకట కృష్ణారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని మంత్రి దుర్గేష్ భావోద్వేగంతో వెల్లడించారు.

సభ అనంతరం 'మహా పురుషుడు మండలి' నాటక ప్రదర్శన వీక్షకులను అలరించింది. ఈ సందర్భంగా 'అజాతశత్రువు ఆదర్శ నేత మండలి వెంకటకృష్ణారావు' మరియు 'కృష్ణా మండలి' గేయ కావ్య గ్రంథాలను ఆవిష్కరించారు.

## రెండేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో తీసుకెళ్తున్నాం


(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చెందుతోందని చెప్పారు. జిల్లాకు కంపెనీలు తీసుకొస్తున్నట్లు యువతతో అన్నారు. ఇప్పుడు వస్తున్న కంపెనీలు గ్రౌండిగ్ అయితే ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. రానున్న రోజుల్లో ఓర్వకల్లుకు భారీగా పరిశ్రమలు వస్తాయని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. తల్లికివందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలున్నా అందరికీ డబ్బులు పడుతున్నాయన్నారు. మంత్రి టీజీ భరత్ ముందస్తు పుట్టినరోజు వేడుకలను స్థానిక నాయకులు వార్డులో నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడమే కాకుండా మహిళలకు మంత్రి చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు, బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

## మంత్రి చేతుల మీదుగా అమరావతి చిత్రకళా వీధి పోస్టర్ ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

800 కు పైగా స్టాల్స్, నిర్విరామంగా సాగే ప్రత్యక్ష కళారూపాలు, సంగీత విభావరి, వినోద కార్యక్రమాలకు 9 కళా వేదికలు, లైవ్ ఆర్ట్ ఇన్స్టాలేషన్స్, ప్రత్యేక ఫోటోబూత్లు, విభిన్న రుచులతో కూడిన ఫుడ్ కోర్టులు ఉంటాయన్నారు.. గత ఏడాది రాజమహేంద్రవరంలో నిర్వహించిన చిత్రకళా వీధికి అపూర్వ స్పందన లభించిందని, ఆ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది రాష్ట్ర ప్రజారాజధాని అమరావతికి అతిసమీపంలో ఉన్న గుంటూరులో మరింత అంగరంగ వైభవంగా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు కళాకారుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేయడానికి ఎంతో తోడ్పడతాయని ఉద్ఘాటించారు.



## 18 ఏండ్ల ప్రొఫెసర్

**ఫ్లోరిడా, ఆగష్టు 4:** అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన అమెరికాకు చెందిన నాథన్ థామస్. 18 ఏండ్ల వయస్సులోనే ప్రొఫెసర్ గా నియమితుడై యూనివర్సిటీలో పీజీ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన ప్రొఫెసర్ గా గిన్నిస్ వరల్ రికార్డ్సులో చోటు సంపాదించాడు.నాథన్ థామస్ పదేళ్ల వయసులోనే డ్యూయల్ డిగ్రీ మియామీ కాలేజీలో చేరి 14 ఏండ్లకే ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ద్వారా బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలు అందుకున్నాడు. ఇప్పుడు ప్రొఫెసర్గా ఇంజినీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు. ఇంజినీర్ల కుటుంబంలో పెరగడం, గణితంపై తల్లి ఆసక్తి పెంచడమే తన ఎదుగుదలకు బలమైన పునాది అని థామస్ అంటాడు. ప్రస్తుతం బోధనతో పాటు మియామీ యూనివర్సిటీ లా స్కూల్లో డిగ్రీ చదువుతున్న చదువుతున్నాడీ చిన్ని ప్రొఫెసర్.

# శిర్డీ సాయినాథునికి బంగారు అక్షరాల 'ఓం సాయి రామ్' కానుక

**శిర్డీ, ఆగష్టు 4:** శిర్డీ సాయిబాబాకు దుబాయికి చెందిన భక్తులు అరుదైన కానుక అందించారు. కొన్ని నెలల క్రితం శిర్డీలో సాయిబాబాను దర్శించుకున్న కక్రూ కుటుంబం 'ఓం సాయి' అని హిందీలో రాసి ఉన్న బంగారు అక్షరాలను కానుకగా ఇచ్చింది. దాదాపు 270 గ్రాములున్న ఈ అక్షరాల విలువ రూ.27 లక్షలు. తాజాగా 'రామ్' అనే అక్షరాలను బంగారంతో తీర్చిదిద్ది సాయి సంస్థాన్ కు అందజేశారు. 76.3 గ్రాములున్న వీటి విలువ సుమారు రూ.10 లక్షలు. అధికారులు ఈ అక్షరాలను ద్వారకామాయిలో బాబా కొలువై ఉన్న గోడపై ప్రతిష్ఠించారు.

# జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

మెటా (ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్), యూట్యూబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ఘటనకు సాంకేతిక లోపమే కారణమని, ప్రధాని పోస్ట్‌ను పొరపాటున తొలగించామని, తర్వాత పునరుద్ధరించామంటూ ఫేస్‌బుక్-మెటా క్షమాపణలు కోరింది. ఆ వివరణ సరిపోదు అని ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖ భావించింది. ఈ విషయం కేవలం సాంకేతిక అంశాలకు సంబంధించినది మాత్రమే కాదని, జాతీయ భద్రత, శాంతిభద్రతలకు సంబంధించినదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వెరిటాస్ విద్యార్థులు

- విద్యతోపాటుగా క్రీడలకు ప్రాధాన్యమిస్తున్నాము
- మూడేళ్ల శ్రమ పలించింది - శేషారెడ్డి




**తిరుపతి ప్రెస్ క్లబ్ ఆగస్టు 4 మనం న్యూస్ :** వెరిటాస్ విద్యాసంస్థలో విద్యార్థులను ఉత్తమ సైనికులుగా దేశానికి అందించడానికి క్రీడలలో పాల్గొనే అవకాశం కల్పిస్తుంది. అందులో భాగంగా నేడు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వెరిటాస్ విద్యార్థులు ఎంపికయ్యాని వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ బి.శేషారెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో సీబీఎస్సీ క్లస్టర్ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులను దేశానికి సేవ చేసే ఉత్తమ సైనికులుగా అందించాలనే లక్ష్యంతో ప్రణాళిక అబద్ధంగా విద్యతోపాటుగా క్రీడలకు ప్రాధాన్యమిస్తున్నామని, దీని ఫలితమే ఇటీవల సీబీఎస్సీ క్లస్టర్ కబడ్డీ పోటీలలో బంగారు పతకాలను సాధించారని తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్ లో నిర్వహించిన సీబీఎస్సీ క్లస్టర్ పోటీలకు 164 పాఠశాలల నుండి 1400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇంతటి క్లిష్టతరమైన పోటీల్లో వెరీ టార్చర్ సైనిక్ స్కూల్ నుండి 5 జట్లలో 60 మంది విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి అత్యుత్తమ ఫలితాలను సాధించారన్నారు. అండర్ 14 బాలురులో స్వర్ణ పతకం, అండర్ 19 బాలురులో స్వర్ణ పతకం, అండర్ 17 బాలికల్లో స్వర్ణ పతకం, అండర్ 14 బాలురు, బాలికలు రజత పతకాలను సాధించి జాతీయ స్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నుండి పాల్గొనే గొప్ప అవకాశమును మా పాఠశాల విద్యార్థులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు.

సెప్టెంబర్ నెలలో ఉత్తర్ ప్రదేశ్ లో జరిగే జాతీయ పోటీల్లో కూడా మా పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, తిరుపతి జిల్లాకు పేరు తెచ్చేలా ఉత్తమ క్రీడా తర్ఫీదును అందిస్తున్నామన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించడానికి తగిన తోడ్పాటు అందించిన వ్యాయామ ఉపాధ్యాయులకు, బోధన, బోధనేతర సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ చక్రవర్తి, కోచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు-వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

### ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రామానాయుడు

**శ్రీకాళహస్తి,ఆగష్టు 4 మనం న్యూస్ :** రైతు,వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిస్తామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రామానాయుడు తెలిపారు.శ్రీకాళహస్తిలోని రైతు సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాసులు అధ్యక్షతన ఏపీ రైతు సంఘం,ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా శాఖల సంయుక్త సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ... ప్రజా చైతన్యం కోసం ఆగస్టు 6 నుంచి 14 వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు,పాదయాత్రలో గుర్తించిన సమస్యలపై ఆగస్టు 17 నుంచి 28 వరకు రెవెన్యూ,ఆర్డీవో,కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టి వినతిపత్రాలు ఇస్తామన్నారు.22-ఏ భూముల సమస్యలు పరిష్కరించి,పట్టాదారు పాస్పుక్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.వర్షాభావం వల్ల తిరుపతి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి పంట నష్టపరిహారం,రుణాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని కోరారు.సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ... ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గంగారపు మునిరత్నం,ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జయరామయ్య,నాయకులు గురవయ్య,గోవిందరెడ్డి,బాలకృష్ణ,చిన్నయ్య,ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారులత,తులసిరాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయిన శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు



**కాట్రేనికోన, ఆగష్టు 4(మనం ప్రతినిధి):** అమలాపురం సమీపంలో చెయ్యేరు నందు గల శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఇటీవల ముమ్మిడి వరంలో జరిగిన అమరావతి ఛాంపియన్ షిప్ మండల స్థాయి లో జరిగినటు వంటి కోకో, కబాడి, చెస్, బాడ్మింటన్, వాలీబాల్ మొదలగు క్రీడలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలు అమలాపురం లో జరగబోవు క్రీడాపోటీలలో పాల్గునటకు అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ బి రత్న రాజు తెలిపారు.. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డి వి ఎన్ ఎన్ వర్మ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించుట ద్వారా కళాశాల ఖ్యాతిని ఇనుమడింప జేసారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గసయ్యులు సందీప్ , కళాశాల ప్రిన్సిపాల్ డా. బి . రత్నరాజు, కళాశాల విద్యార్థి సంక్షేమ విభాగం, డా. బి . అరుణ్ కుమార్, కళాశాల వ్యాయామ ఉపాద్యాయుడు ఎస్ .కే . ఆలీ, కళాశాల వివిధ ముఖ్య విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధి విభాగంలో జాతీయ అవార్డు అందుకున్న రాజన్న ఫౌండేషన్



**తిరుపతి ఆగస్టు 4 మనం న్యూస్:** సీఎస్ఆర్ టైమ్స్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని లీ మెరిడియన్ హోటల్లో మంగళవారం నిర్వహించిన 13వ జాతీయ కార్పొరేట్ సామాజిక బాధ్యత పర్యావరణ, సామాజిక, సుపరిపాలన సదస్సు మరియు అవార్డులు-2026లో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి (గ్రామాభివృద్ధి) విభాగంలో రాజన్న ఫౌండేషన్ ప్రతిష్మాత్మక జాతీయ అవార్డును అందుకుంది.

ఈ అవార్డును రాజన్న ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరీనేని భారతదేశంలోని రొమేనియా రాయబారి సెనా లతీఫ్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ మాజీ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి భాస్కర్ ఛటర్జీ చేతుల మీదుగా అందుకున్నారు.సమ్మిళిత భారత నిర్మాణంలో బాధ్యతాయుత వ్యాపారాల పాత్ర‘ అనే అంశంతో నిర్వహించిన ఈ సదస్సులో వికసిత్ భారత్-2047 మరియు ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనకు విశేష కృషి చేస్తున్న సంస్థలను సత్కరించారు.

## శ్రీవారి అగరబత్తుల పేరుతో ఆన్లైన్ దోపిడీ..! ఈ-కామర్స్లో నకిలీ విక్రయాలపై టిటిడి అప్రమత్తం

- టిటిడి అనుమతి లేకుండానే ఆన్లైన్లో విక్రయాలు చేస్తున్నట్లు ఆరోపణలు
- రూ.452 అగరబత్తుల కాంబోను రూ.1,000కుపైగా విక్రయిస్తున్న ఈ-కామర్స్ సంస్థలు

**తిరుమల ఆగస్టు 4 మనం న్యూస్:** తిరుమల శ్రీవారి అగరబత్తుల పేరుతో కొన్ని ఈ-కామర్స్ వేదిక నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. టిటిడి అనుమతి లేకుండానే శ్రీవారి పేరు, తిరుమల పవిత్రతను వినియోగిస్తూ అగరబత్తుల కాంబో ప్యాకేజీలతో పాటు తీర్థం, చిత్రపటాలు, ప్రసాదాలు అందిస్తున్నట్లు ప్రచారం చేయడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టిటిడి తయారు చేసే శ్రీవారి అగరబత్తుల కాంబో ప్యాక్ ధర రూ.452.38 కాగా, అదే ఉత్పత్తిని కొన్ని ఆన్లైన్ వేదికల్లో రూ.1,035 నుంచి రూ.1,049 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అగరబత్తులతో పాటు చిన్నపాటి వస్తువులు జతచేసి అధిక ధరలకు విక్రయిస్తూ భక్తులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టిటిడి ఆధ్వర్యంలోని తిరుమలతో పాటు తిరుచానూరు, గోవిందరాజస్వామి, కోదండరామస్వామి, కపిలేశ్వరస్వామి తదితర ఆలయాల్లో స్వామివారి అలంకరణకు వినియోగించిన పుష్పాలతో ఈ అగరబత్తులు తయారుచేసి అధికారిక విక్రయ కేంద్రాలు, వెబ్సైట్ ద్వారా విక్రయిస్తోంది. అయితే అగరబత్తుల ఆన్లైన్ విక్రయాలకు టిటిడి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

టిటిడి పేరు, అధికారిక లేబుళ్లను అనధికారికంగా వినియోగించడం చట్టవిరుద్ధమని పేర్కొంటున్న అధికారులు, నిబంధనలను ఉల్లంఘిస్తూ విక్రయాలు చేస్తున్న వారిపై విచారణ చేపట్టి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

అనధికారిక ఆన్లైన్ ప్రచారాలను నమ్మి మోసపోవద్దని, టిటిడి అధికారిక విక్రయ కేంద్రాలు లేదా అధికారిక వెబ్సైట్ ద్వారా మాత్రమే అగరబత్తులు, ప్రసాదాలు వంటి పవిత్ర వస్తువులను కొనుగోలు చేయాలని భక్తులకు అధికారులు సూచించారు.

## మొరంపల్లి చిన్నారుల విద్యా కల సాకారం

### విద్యార్థుల సౌకర్యార్థం నూతన పాఠశాల ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్



**పూతలపట్టు ఆగస్టు 4 మనం న్యూస్:** పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం మొరంపల్లి బీసీ కాలనీలో విద్యార్థుల సౌకర్యార్థం ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదివే చిన్నారుల కోసం నూతన పాఠశాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, పాఠశాలను పునః ప్రారంభించారు.

మొరంపల్లి బీసీ కాలనీలోని 21 మంది విద్యార్థులు గత 15 సంవత్సరాలుగా సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్క గ్రామానికి వెళ్లి విద్యాభ్యాసం కొనసాగిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సహకారంతో యుద్ధప్రాతిపదికన పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రామంలో ఒక ప్రాథమిక పాఠశాల (ప్రైమరీ స్కూల్) అవసరం ఈ పాఠశాలకి కావలసిన అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు, ఎంఈఓ, డిఇఓ ఈ పాఠశాలను నిరంతర పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారువిద్యాశాఖకు సంబంధించి ప్రభుత్వం ద్వారా చాలా స్పష్టంగా ఆదేశాలు (ఇన్స్ట్రక్షన్స్) ఇవ్వడం జరిగింది. టీచర్లను అసలు ఇబ్బంది (డిస్టర్బ్) చేయకూడదు. వాళ్లు విద్యా రంగంలోనే పూర్తిగా నిమగ్నం అవ్వాలని తెలిపారు.

## తిరుపతి జిల్లాలో చెరకు సాగు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరిన ఎంపీ గురుమూర్తి



**తిరుపతి, ఆగస్టు 4 మనంన్యూస్:** తిరుపతి జిల్లాలో చెరకు సాగు విస్తీర్ణం, ఉత్పత్తి క్రమంగా తగ్గిపోతున్న నేపథ్యంలో ఎంపీ గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి కారణాలు, రైతులకు అందిస్తున్న సహాయం, చెరకు పరిశ్రమ పునరుద్ధరణకు తీసుకుంటున్న చర్యలపై తిరుపతి ఎంపీ గురుమూర్తి మంగళవారం లోక్సభలో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్నాథ్ ఠాకూర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్లోని అన్ని జిల్లాల వారీగా చెరకు సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, దిగుబడి వివరాలను కేంద్రం సభకు సమర్పించింది. తిరుపతి జిల్లాలో చెరకు సాగు, ఉత్పత్తి తగ్గుముఖం పట్టినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. చెరకు ఉత్పత్తి పెంపు, సాగు పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఐసీఏఆర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్కు అనువైన అధిక దిగుబడి, వ్యాధి నిరోధక లక్షణాలు కలిగిన ఇౌ09004 చెరకు రకాన్ని విడుదలకు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్ ద్వారా రైతులకు శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తూ చెరకు ఉత్పాదకత పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ ఉపమిషన్ కింద ఆంధ్రప్రదేశ్కు 2014-15 నుంచి 2026-27 వరకు రూ.955.28 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై పంపిణీ చేయడంతో పాటు, కస్టమ్ హైరింగ్ సెంటర్లు, హైటెక్ హబ్లు, ఫార్మ్ మెషినరీ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## శ్రీ గంగమ్మ ఆలయ అభివృద్ధిపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు

- కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్

**కుప్పం ఆగస్టు, 4మనం న్యూస్:** కుప్పం శ్రీ గంగమ్మ ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణానికి సంబంధించి ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని, సామాజిక మాధ్యమాలు, యుట్యూబ్ ఛానళ్లు, టెలివిజన్ మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కడా) ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ స్పష్టం చేశారు.

మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శ్రీ గంగమ్మ ఆలయ అభివృద్ధి అంశంపై సోమవారం సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, రాష్ట్రస్థాయి అధికారులతో సాధారణ సమీక్ష సమావేశం మాత్రమే నిర్వహించామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన వివిధ నమూనాలు, ప్రతిపాదనలపై చర్చించినప్పటికీ ఎలాంటి తీర్మానం చేయలేదని, పునర్నిర్మాణంపై ప్రభుత్వం ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

సుమారు ఏడాదిన్నర క్రితం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ అభివృద్ధి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. జాతరకు లక్షలాది మంది భక్తులు విచ్చేసే నేపథ్యంలో మరుగుదొడ్లు, మౌలిక వసతులు, పరిసరాల అభివృద్ధి వంటి పనులకు సుమారు రూ.8 నుంచి రూ.9 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, ముఖ్యమంత్రి సహకారంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే ఆలయ కమిటీతో పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయని వివరించారు.



## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు వైఎస్సార్సీపీ డిమాండ్



**తిరుపతి రూరల్ ఆగస్టు 4 మనం న్యూస్:** డీఎస్సీ-2025 నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో విచారణ చేపట్టాలని, నిష్పాక్షిక దర్యాప్తు కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి నైతిక బాధ్యతతో రాజీనామా చేయాలని వైఎస్సార్సీపీ నాయకులు డిమాండ్ చేశారు. చంద్రగిరి నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచనల మేరకు తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో మంగళవారం నిర్వహించిన టౌన్హాల్ సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల హామీలకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పరిమిత పోస్టులతోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా నిరుద్యోగ యువతను నిరాశ పరిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు మునీశ్వర్రెడ్డి, మూలం చంద్రమోహన్ రెడ్డి, దామినేటి కేశవులు, మొగరాల హరి ప్రసాద్రెడ్డి, ఓబుల్రెడ్డి, శశిధర్రెడ్డి, కరమలవల్లి, శెల్వం, మన్నూరు శివ, తులసీరెడ్డి, ముచ్చెలి కిరణ్కుమార్రెడ్డి, తుంటి సుధా యాదవ్, భాను ప్రకాష్రెడ్డి, సింగం తేజ, మల్లె మొగ్గల ఉమాపతి, యశ్వంత్రెడ్డి, దయ, రాజ, చెంగల్రెడ్డి, వినోద్, గూడూరు రఫీ, శెంథిల్కుమార్, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

## కిషోరి బాలికలకు టీనేజ్ ప్రెగ్నెన్సీపై అవగాహన సమావేశం

**కాట్రేనికోన ఆగష్టు 4 మనం ప్రతినిధి:** విద్యార్థి దశలో విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ పెట్టాలని, బాలల హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె నాగమణి సూచించారు. సిడిపిఓ ముదునూరి నీహారిక ఆధ్వర్యంలో కాట్రేనికోన హైస్కూల్ నందు డివిజనల్ లెవల్ లో 200 మంది కిశోరి బాలికలకు ‘టీనేజ్ ప్రెగ్నెన్సీ‘ కారణాలు గురించి అవగాహన సమావేశం మంగళవారం కాట్రేనికోన జిల్లా పరిషత్ హై స్కూల్ నందు నిర్వహించారు . కార్యక్రమం నకు ప్రాజెక్టు డైరెక్టర్ కె.నాగమణి ముఖ్య అతిథిగా హాజరై బాలల హక్కుల గురించి, రక్షణ చట్టాలు గురించి తెలియచేసి, బాల్య వివాహాలు చేసుకుంటే జరిగే అనర్థాలు గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమం లో సూపర్ వైజర్లు కే వి వి ఎస్ తులసి కుమారి , లంకే వెంకట రమణ , హెచ్ ఎం రేఖపల్లి అంబ , హెల్త్ సిబ్బంది,అంగన్వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరైనారు.



## మహిళల భద్రత, సైబర్ నేరాలు, శక్తి యాప్పై విద్యార్థులకు సమగ్ర అవగాహన



- డ్రగ్స్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ నిబంధనలు, సోషల్ మీడియా భద్రతపై సూచనలు
- అత్యవసర పరిస్థితుల్లో డయల్-112, శక్తి యాప్ వినియోగించాలని సూచన.

**తిరుపతి ఆగస్టు 4 మనం న్యూస్:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మహిళలు, విద్యార్థులు, యువతలో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు శక్తి టీమ్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బి.ఎడ్. విద్యార్థినులకు శక్తి టీమ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, శక్తి యాప్ వినియోగం మరియు ప్రయోజనాలు, లోన్ యాప్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, చైల్ పోర్నోగ్రఫీ, సైబర్ నేరాలు, తెలియని లింకులు, వీడియో కాల్స్ ద్వారా జరిగే మోసాలు, సోషల్ మీడియాలో ఫోటోలు పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాలు, ఉద్యోగ మోసాలు, ఓటీపీ మోసాలు, ఆన్లైన్ బెట్టింగ్, మహిళల అక్రమ రవాణా, మహిళలపై నేరాలు, డ్రగ్స్ దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలు, ర్యాపిడో, ఆటో, బైక్ ప్రయాణాల్లో పాటించాల్సిన భద్రతా సూచనలు, సమాజంలో మహిళలకు సంబంధించిన తాజా ఘటనలు, మంచి స్నేహం, మంచి ప్రవర్తన, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు.

## ఒక మొక్కను నాటండి

మద్యం ఒలికితే గీయబడిన
చిత్రాన్ని నేను

సారా కంపులో శ్వాసిస్తున్న
నిస్సహాయతను నేను

రోజూ ఆలోచనల
కొక్కానికి వ్రేలాడుతూ
బతుకు చిత్రం కొత్తగా
గీసుకోవాలని ఆశపడే
అమాయకపు ఆడపిల్లను నేను

ఎప్పుడైనా నేను రాక్షస ఆనందానికి
బలైపోతే, ఎనిమిదో అడుగు వేసిన నాడు
మద్యం తాగి నా గొయ్యి తవ్వకండి
బ్రతికినంత కాలం చేసింది అదేగా!

నన్ను కలవాలని కలవనివారు
కన్నెత్తి చూడని వారు
ఇప్పుడు అటుగా నడిచే అవకాశం ఉంది
సమాధిపై పరిమళం వెదజల్లే

ఒక మొక్కను నాటండి
నా దేహంపై కప్పిన మట్టిలో
ఇంకిన పూల సౌరభం

సమాధిలోనైనా సుఖంగా ఉన్నాననే
భావన అందరికీ కలిగించాలి

**- పద్మజా రామకృష్ణ. పి**
9491830278

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@ gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్**

# యువతకు రక్షణ.. పేపర్ లీకేజీల నియంత్రణ చట్టం

భారతీయ సాంస్కృతిక విశిష్టతలో విద్యకు అత్యున్నత పీఠం ఉంది. 'విద్యా ధనం సర్వధన ప్రధానమ్' అని ప్రాచీన సంస్కృత నానుడి చాటి చెప్పినట్లుగానే, విజ్ఞానం మానవాళికి వికాసాన్ని అందించే అమూల్యమైన సంపద. వేమన యోగి తన పద్యంలో 'నిజమునకు నిలువ గలవాడే నరుడగు' అని వచించిన రీతిలో, సత్యం,నిష్పాక్షికత, నిజాయితీలపైనే ఏ సమాజమైనా,ఏ వ్యవస్థ యినా నిలబడ గలుగుతుంది. ముఖ్యంగా, నిరుద్యోగ రహిత సమాజ నిర్మాణంలోనూ, యువత ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించడంలోనూ పబ్లిక్ పరీక్షలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోనూ, కేంద్ర స్థాయిలోనూ చోటుచేసుకున్న ప్రశ్న పత్రాల లీకేజీ ఉదంతాలు, సామూహిక కాపీయింగ్, సాంకేతిక దుర్వినియోగ సంస్కృతి మన విద్యావ్యవస్థ మూలాలనే కంపిం పజేశాయి. ప్రతిభావంతులైన లక్షలాది మంది నిరుద్యోగ యువత రక్తాన్ని చెమటగా మార్చి రాత్రింబవళ్లు చదివిన శ్రమను, వారి కుటుంబాల ఆశలను ఈ అక్రమ ముఠాలు ఒక్క క్షణంలో బూడిదలో పోసిన పన్నీరుగా మార్చి వేశాయి. ఈ కలుషిత వాతా వరణాన్ని ప్రక్షాళన చేస్తూ, పరీక్షా విధానంలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనను పునఃప్రతిష్ఠించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అక్రమాల నిరోధక) చట్టం-2024' పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొంది, రాష్ట్రపతి ముద్రతో అమల్లోకి రావడం దేశ విద్యా చరిత్రలోనే ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది.

గత కొన్ని సంవత్సరాల పూర్వాపరాలను పరిశీలిస్తే, ప్రశ్న పత్రాల చోరీ, లీకేజీలు కేవలం స్థానిక పరిధికి మాత్రమే పరిమి తం కాకుండా వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందడం అత్యంత శోచనీయం. వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్-యుజి, పరిశోధక అభ్యర్థుల యుజిసి-నెట్ పరీక్షల రద్దుతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు, పోలీస్ నియామకాలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించిన అనేక పోటీ పరీక్షలు లీకేజీ భూతానికి బలయ్యాయి. ఈ రద్దుల కారణంగా గత ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 1.5 కోట్లకు పైగా అభ్యర్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడింది. ఒక పరీక్ష రద్దయితే, అది కేవలం ప్రకటన నిలిచి పోవడం మాత్రమే కాదు.. పరీక్ష అల వెన్సులు, శిక్షణ ఖర్చులు, లాడ్జింగ్, ప్రయాణ వ్యయాల రూపంలో అభ్యర్థుల కుటుంబాలపై కోట్లాది రూపాయల ఆర్థిక భారం పడుతుంది. ప్రభుత్వ ఖజానాపై పునర్నిర్వహణ వ్యయం కత్తిలా వేలాడుతుంది. అంతకంటే మిన్నగా అభ్యర్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి, నైరాశ్యానికి గురై తమ అమూల్యమైన జీవితకాలాన్ని నష్టపోతున్నారు. 'న్యాయం ఆలస్యమైతే అది నిరాకరించ బడినట్లే' అనే నానుడిలా, పరీక్షలు నిరంతరం వాయిదా పడడం వల్ల యువత ఉత్పత్తి సామర్థ్యం వృథాగా పోతోంది.




ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినప్పటికీ, సైబర్ నేరగాళ్లు, కోచింగ్ మాఫియా, మధ్యవర్తులు, ప్రింటింగ్ ప్రెస్ సిబ్బంది పరస్పరం కుమ్మక్కై సృష్టిస్తున్న అక్రమాలు పరీక్షల భద్రతను సవాలు చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ఇయర్‌పీస్లు, బ్లూటూత్ డివైజ్‌లు, డమ్మీ అభ్యర్థులను కూర్చోబెట్టడం, డిజిటల్ మాధ్యమాల ద్వారా లీకైన పేపర్లను సెకన్ల వ్యవధిలో పంపిణీ చేయడం వంటి కుట్రలు వ్యవస్థీకృతంగా సాగుతున్నాయి. ఈ దారుణ పరిస్థితుల నేపథ్యాన్నే కొత్త చట్టం తీవ్రంగా పరిగణించింది. ఈ నూతన చట్టం ప్రకారం, ప్రశ్నపత్రాల చోరీ, లీకేజీ, కొనుగోలు, విక్రయం, సామూహిక కాపీయింగ్, ఎలక్ట్రానిక్ ఆధారిత మోసాలు నాన్-బెయిలబుల్ నేరాలుగా వర్గీకరించబడ్డాయి. సాధారణ అక్రమాలకు పాల్పడే వ్యక్తిగత నేరస్థులకు 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. ఇక వ్యవస్థీకృత నేర ముఠాలు, లీకేజీలకు ఒడిగట్టే సంస్థలు లేదా కోచింగ్ సెంటర్లకు 5 నుంచి 10 ఏళ్ల వరకు కారాగార శిక్షతో పాటు ఏకంగా రూ.1 కోటి వరకు భారీ జరిమానాలు విధిస్తారు. అక్రమాల ద్వారా సంపాదించిన అక్రమాస్తులను జప్తు చేసే అధికారాన్ని విచారణ సంస్థలకు కల్పించడం ద్వారా నేరస్థుల గుండెల్లో భయం కలిగించేలా చట్టాన్ని కట్టుదిట్టం చేశారు.

ఈ చట్టం పరిధిలోకి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ , రైల్వే రిక్రూట్మెంట్ బోర్డులు, ఐబీపీఎస్ వంటి ప్రధాన కేంద్ర పరీక్షా నిర్వహణ సంస్థలన్నీ వస్తాయి. చట్ట అమలుతో పాటు పరీక్షా నిర్వహణలో బహుళస్థాయి భద్రతా వ్యవస్థ ప్రాధాన్యం సంతరించు కోనుంది. ప్రశ్నాపత్రాల ముద్రణ దశ నుండి పంపిణీ వరకు ఎండ్-టు-ఎండ్ ఎన్క్రిప్షన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ సర్వైలెన్స్, బయోమెట్రిక్ ప్రామాణీకరణ, సురక్షిత డిజిటల్ వాల్ట్‌ల వినియోగం తప్పనిసరి కానున్నాయి. ఇది కేవలం కేంద్ర పరీక్షలకే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా తమ స్వంత చట్టాలను మరింత కఠినతరం చేసుకోవడానికి ఒక మార్గదర్శిగా నిలుస్తుంది.

అయితే, సమాజంలో చట్టాలు రూపుదిద్దుకోవడం ఒకెత్తయితే, వాటిని క్షేత్రస్థాయిలో అక్షరాలా అమలు చేయడం మరొక ఎత్తు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కేవలం కఠిన శిక్షల చట్టాలు మాత్రమే సమాజంలోని కుళ్ళిన వ్యవస్థను రాత్రికి రాత్రే మార్చలేవు. ఈ చట్టానికి తోడుగా ప్రత్యేక వేగవంతమైన న్యాయస్థానాల ఏర్పాటు, సుశిక్షిత స్వతంత్ర దర్యాప్తు బృందాల పర్యవేక్షణ, విచారణలో కాలయాపన లేకపోవడం అత్యంత ప్రాధాన్యం. పరీక్షా నిర్వహణ సంస్థల్లో నైతిక పరిపాలన, అంతర్గత ఆడిటింగ్, ఉద్యోగుల జవాబుదారీతనం పెంపొందించడం ద్వారా మాత్రమే నమ్మకాన్ని పునరుద్ధరించ గలము. 'మొక్కై వంగనిది మానై వంగునా' అనే సామెత చందంగా, నైతిక విలువలతో కూడిన విద్యా సంస్కృతిని, అక్రమ మార్గాల పట్ల అసహ్యభావాన్ని అభ్యర్థుల్లో కూడా పెంపొందించాలి.

భారతదేశ భాగ్యరేఖలు తరగతి గదుల్లోనూ, పరీక్షా హాళ్లలోనే తీర్చిదిద్ద బడతాయి. కోట్లాది మంది యువత ఆశలకు, ప్రతిభకు ఏ ఒక్క అక్రమార్కుడి స్వార్థం గ్రహణం పట్టకూడదు. 'కష్టపడిన వానికి కడుపు నిండును' అన్న చందాన, శ్రమించిన అభ్యర్థికే విజయం దక్కాలనే సార్వత్రిక న్యాయ సూత్రానికి ఈ చట్టం భరోసా ఇస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, ఆధునిక సాంకేతిక భద్రత, పారదర్శక పరిపాలన, చట్టం యొక్క నిర్దాక్షిణ్య అమలు సమగ్రంగా మేళవించినప్పుడే ప్రశ్నపత్రాల లీకేజీ మహమ్మారి దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టుకు పోతుంది. అప్పుడే మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిభకు తగిన గౌరవం దక్కి, దేశ విద్యా విధానం సుదృఢమైన, విశ్వసనీయమైన పునాదులపై విరాజిల్లుతుంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# నాగపూర్‌లో పర్యావరణ పునరుద్ధరణ

భారత ప్రభుత్వం 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' కింద దేశవ్యాప్తంగా పాత చెత్తకుప్పల శాస్త్రీయ నిర్మూలన కార్యక్రమాలను వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు బయో-మైనింగ్, ఆధునిక వ్యర్థాల ప్రాసెసింగ్ సాంకేతికతలను ఉపయోగిస్తూ పర్యావరణ హితమైన పట్టణాలను నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ప్రయత్నాల్లో మహా రాష్ట్రలోని నాగ్‌పూర్ నగరం ఒక గొప్ప ఆదర్శంగా నిలిచింది. ఒకప్పుడు నగరానికి పెద్ద పర్యావరణ సమస్యగా మారిన భాండేవాడి చెత్తకుప్పను శాస్త్రీయంగా పునరుద్ధరించి, దానిని ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రంగా తీర్చిదిద్దడంలో నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ అద్భుతమైన విజయాన్ని సాధించింది.




మధ్య భారతదేశంలోని ప్రముఖ నగరాల్లో ఒకటైన నాగ్‌పూర్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. 30 లక్షలకు పైగా జనాభా కలిగిన ఈ నగరంలో గృహాలు, మార్కెట్లు, విద్యాసంస్థలు మరియు వాణిజ్య సంస్థల నుండి ప్రతిరోజూ అపారమైన మొత్తంలో ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. దశాబ్దాలుగా ఈ వ్యర్థాలన్నింటినీ నగర శివారులోని భాండేవాడి డంపింగ్ యార్డుకు తరలించడంతో అది భారీ ఎత్తున చెత్తకుప్పగా మారిపోయింది. దీని వల్ల తీవ్రమైన పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్య సమస్యలు, భూవినియోగ సంక్షోభాలు ఏర్పడ్డాయి. దీంతో నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ స్పందించి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణకు కృతనిశ్చయంతో ముందుకు సాగింది.

భాండేవాడి డంప్‌లో పేరుకుపోయిన పాత చెత్తను ఆధునిక బయో-మైనింగ్ పద్ధతుల్లో తవ్వి, వేరు చేసి, ప్రాసెస్ చేయడం ద్వారా సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలను విజయవంతంగా శుద్ధి చేశారు. ఈ ప్రక్రియ ద్వారా భారీ స్థాయిలో భూమిని తిరిగి వినియోగానికి అందుబాటులోకి తెచ్చారు. ఇందులో భాగంగా వ్యర్థాలను వివిధ రకాలుగా వర్గీకరించి, పునర్వినియోగపరచదగిన వాటిని రీసైకిల్ చేయడం, సేంద్రీయ పదార్థాలను కంపోస్టుగా మార్చడం, మరియు మిగిలిన వాటి నుండి ఇంధనాన్ని తయారు చేయడం జరిగింది. ఈ విధానం వల్ల డంప్‌లోని వ్యర్థాలు క్రమంగా తగ్గిపోయి, పర్యావరణ భారం గణనీయంగా తగ్గింది.

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ఫలితంగా సుమారు 55 ఎకరాల విలువైన భూమి చెత్త కుప్పల బారి నుండి విముక్తి పొంది తిరిగి ప్రభుత్వ వినియోగానికి సిద్ధమైంది. గతంలో పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి, ఉపయోగించలేని స్థితిలో ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం ఆధునిక వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రంగా మారింది. ఈ స్థలం ఇప్పుడు పర్యావరణానికి హాని కలిగించే బదులు, నగరానికి ఒక ఆస్తిగా మారింది. ఈ పునరుద్ధరణ వలన నగరానికి కొత్తగా అభివృద్ధి ప్రాజెక్టులకు స్థలం లభించడమే కాకుండా, చుట్టుపక్కల పర్యావరణం కూడా స్వచ్ఛంగా మారింది.

భాండేవాడిలో ప్రస్తుతం ఏర్పాటు చేసిన సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి... మెటీరియల్ రికవరీ ఫెసిలిటీస్, కంపోస్టింగ్ యూనిట్లు తయారీ కేంద్రాలు, లీచేట్ శుద్ధి వ్యవస్థలు, మరియు నిరంతర పర్యావరణ పర్యవేక్షణ వ్యవస్థలు. ఈ కేంద్రంలో వ్యర్థాలను చెత్తగా కాకుండా విలువైన వనరులుగా పరిగణించి, వాటి నుండి ఇంధనం, ఎరువు, రీసైకిల్ పదార్థాలను తయారు చేస్తున్నారు. ఇది వ్యర్థాల నిర్వహణలో ఒక సర్క్యులర్ ఎకానమీ నమూనాకు అద్దం పడుతుంది.

భాండేవాడి కేంద్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా, ట్రామెల్ యంత్రాలు, బాలిస్టిక్ సెపరేటర్లు, ఆటోమేటెడ్ కంపోస్టింగ్ వ్యవస్థలు, రియల్-టైమ్ మానిటరింగ్, సీసీటీవీ నిఘా వ్యవస్థ మరియు ధూళి నియంత్రణ వ్యవస్థలు ఇక్కడ అమలులో ఉన్నాయి. ఈ సాంకేతికతలు వ్యర్థాల వేరు చేత, ప్రాసెసింగ్ను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మరియు సురక్షితంగా మార్చాయి. ఫలితంగా, కార్మికుల ఆరోగ్యం, పరిసర ప్రాంతాల పర్యావరణం కూడా రక్షించబడుతోంది.

భాండేవాడి రూపాంతరం వల్ల నాగ్‌పూర్ నగరానికి అనేక పర్యావరణ మరియు సామాజిక ప్రయోజనాలు లభించాయి. గాలి, నీరు, నేల కాలుష్యం బాగా తగ్గింది. పరిసర ప్రాం తాల్లో ప్రజారోగ్య పరిస్థితులు మెరుగు పడ్డాయి మరియు రీసైక్లింగ్, వనరుల పునర్వినియోగం పెరగడంతో కొత్త ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడ్డాయి. ఇవన్నీ మిలిటే పర్యావరణ అనుకూల పట్టణాభివృద్ధికి బాటలు వేశాయి.


భాండేవాడి ప్రాజెక్టు విజయంతో స్ఫూర్తి పొందిన నాగ్‌పూర్ నగరం వ్యర్థాల నిర్వహణను మరింత బలోపేతం చేయడానికి అనేక అదనపు ప్రాజెక్టులను కూడా ఏర్పాటు చేసింది. వీటిలో కొత్త కంపోస్టింగ్ ప్లాంట్లు, మాడ్యులర్ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు, మెటీరియల్ రికవరీ కేంద్రాలు మరియు నిర్మాణ వ్యర్థాల ప్రత్యేక ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ కార్యక్రమాలు నగరంలో వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణకు ఎంతో దోహదపడుతున్నాయి.

సారాంశంగా, భాండేవాడి ప్రాజెక్టు అసాధారణమైన విజయాన్ని సాధించింది. 10 లక్షల మెట్రిక్ టన్నుల పాత వ్యర్థాల శుద్ధీకరణ, 55 ఎకరాల భూమి పునరుద్ధరణ, ఆధునిక సమగ్ర వ్యర్థాల ప్రాసెసింగ్ మౌలిక వసతుల ఏర్పాటు - ఇవి ఈ ప్రాజెక్టు యొక్క ముఖ్య విజయాలు. శాస్త్రీయ వ్యర్థాల విభజన, రీసైక్లింగ్, వనరుల పునర్వినియోగం ద్వారా సర్క్యులర్ ఎకానమీకి ప్రోత్సాహం అందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిర పట్టణాభివృద్ధికి ఈ ప్రాజెక్టు మార్గదర్శకత్వం వహించింది. నాగ్పూర్లోని ఈ రూపాంతరం భారత పట్టణాల వ్యర్థాల నిర్వహణలో ఒక ఆదర్శప్రాయమైన నమూనాగా నిలిచింది. శాస్త్రీయ ప్రణాళిక, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు సమర్థవంతమైన అమలు ద్వారా పాత చెత్తకుప్పలను సుస్థిర అభివృద్ధికి వనరులుగా ఎలా మార్చవచ్చో ఈ ప్రాజెక్టు నిరూపించింది. నగరాలు వ్యర్థాలను సమస్యగా కాకుండా అవకాశంగా భావించి నిర్వహిస్తే, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను కూడా సాధించవచ్చని భాండేవాడి విజయగాథ స్పష్టం చేస్తోంది.

**- డాక్టర్ ఏలూరి యాదయ్య**

# రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం ఏమిటి?

నేడు రిజర్వేషన్లపై జరుగు తున్న చర్చను కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వా మ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టుగా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. ప్రతి అసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు.కానీ చరిత్రను రద్దు చేయలేదు.ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. చరిత్ర సృష్టించిన అసమానతలను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అందరికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగించదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమానత్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. నిజానికి మెరిట్ కూడా ఒక సామాజిక నిర్మాణమే. న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో, శాసనసభల్లో, పరిపాలన వ్యవస్థలో, సమాజంలోని అన్ని వర్గాలు కనిపించాలి. ఎందుకంటే రాష్ట్రం కేవలం అధికారం నిర్మాణం కాదు. రిజర్వేషన్ల గురించి ఏ నిర్ణయానికైనా రాకముందు ఆ షరతు నిజంగా నెరవేరిందా అనే కనీస ప్రాథమిక ప్రశ్నలనైనా మనకు మనమే వేసుకోవాలి. అది కులం మనిషి అవకాశాలను, ఆత్మ గౌరవాన్ని,జీవిత గమనాన్ని, ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని ధైర్యంగా ప్రకటించగలమా? ఇలాంటి సమయంలోనే రిజర్వేషన్లపై చర్చ మళ్ళీ రాజకీయ కేంద్రంగా మారడం గమనించదగిన విషయం. రాజకీయాలు ఎప్పుడు సమస్యలు మాత్రమే పరిష్కరించవు. నిరుద్యోగం, పరీక్షల నిర్వహణ, విద్యాసంక్షోభం, పెరుగుతున్న అసమానతలు చర్చలో ఉన్న ఈ సమయంలో రిజర్వేషన్లను కేంద్ర అంశాలుగా నిలబెట్టడం వెనుక రాజకీయ సందర్భాన్ని విస్మరించడం కష్టం. రిజర్వేషన్ల పట్ల విముఖతను వ్యక్తం చేస్తూ వచ్చిన బిజెపి రాజకీయ సైద్ధాంతిక వైఖరి నేపథ్యంలో ఈ చర్చను విశ్లేషించడం సహజమే. 'రిజర్వేషన్ల స్థానంలో సామాజిక న్యాయాన్ని మరింత సమర్థంగా సాధించే వ్యవస్థ ఏమిటి'? ఈ ప్రశ్నకు సమాధానం



ఇప్పటివరకు స్పష్టంగా వినిపించలేదు. ఎందుకంటే ప్రత్యామ్నయం అనేది ఒక నినాదం కాదు. ఒక సామాజిక నిర్మాణం. ఈ పరిస్థితులను సృష్టించకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామాజిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం. కానీ ఆ సమాజాన్ని నిర్మించే దిశగా మనం నిజంగా ప్రయాణిసున్నామా? లేక రిజర్వేషన్లనే ప్రశ్నిస్తూ వాటిని అనివార్యం చేసిన సామాజిక నిర్మాణాన్ని యధాతథంగా కొనసాగిస్తున్నామా? భారత ప్రజాస్వామ్యం చివరికి సమాధానం చెప్పాల్సింది ఈ ప్రశ్నకే.

**- ఆయిరబోయిన బిక్షపతి**
7993248717

# బ్రాహ్మణపల్లి హౌసింగ్ కాలనీని ఆకస్మికంగా తనిఖీ

## జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



**పుట్టపర్తి, ఆగస్టు 4 మనం న్యూస్ :** శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఉదయం పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణపల్లి హౌసింగ్ కాలనీని ఆకస్మికంగా సందర్శించి గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. కాలనీలో జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. లేఅవుట్లోని ప్రతి ఇంటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి ప్రత్యేక ఫార్మాట్లో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆన్లైన్ డేటా ఆధారంగా బేస్మెంట్ స్థాయి నుంచి పూర్తయిన గృహాల వరకు నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల వివరాలు, పనుల స్థితిగతులను సమగ్రంగా నమోదు చేసి తక్షణమే నివేదిక అందించాలని సూచించారు.

వివిధ కారణాలతో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను గుర్తించి, లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే పనులు పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రతి ఇంటి నిర్మాణాన్ని వేగవంతం చేసి, లబ్ధిదారులకు త్వరితగతిన ఇళ్లు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా హౌసింగ్ అధికారి వెంకటనారాయణ, డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ), తహసీల్దార్ సంహిత, మున్సిపల్ అధికారులు, హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా
# ముదునూరి మురళీ కృష్ణం రాజు



**ప్రత్తిపాడు, ఆగస్టు 4 మనం న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయనను ఈ స్థానంలో నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

పార్టీ తరఫున ప్రజా సమస్యలపై గొంతుక వినిపించడంలోనూ, వైఎస్సార్సీపీ సిద్ధాంతాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో మురళీ కృష్ణంరాజు కీలక పాత్ర పోషిస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి పార్టీ ముఖ్య నేతలకు ముదునూరి మురళీ కృష్ణంరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ నియామకం పట్ల వైఎస్సార్సీపీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# మైనింగ్ రవాణా అరికట్టేందుకు కృషి చేయండి

## బిజెపి కాకినాడ పార్లమెంట్ ఇంచార్జ్ చిరుకూరి రామ్ కుమార్



**శంఖవరం ఆగస్టు 04 మనం ప్రతినిధి:** శంఖవరం రౌతులపూడి మండలాల ప్రధాన రహదారిపై ప్రయనిస్తున్న మైనింగ్ భార్య టిప్పర్ లారీల రవణాను అరికట్టాలని బిజెపి కాకినాడ పార్లమెంట్ ఇంచార్జ్ చిరుకూరి రామ్ కుమార్ పిలుపునిచ్చారు.

మండల కేంద్రమైన శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను మంగళవారం సాయంత్రం చిరుకూరి రామ్కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శంఖవరం రౌతులపూడి మండలాల మీదగా వెళ్తున్న భారీ టిప్పర్ లారీల ద్వారా పర్యావరణం నశించిపోతుందని, రెండు మండలాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని రోగాల బారిన కూడా పడ్డారని తెలిపారు. త్వరలో రెండు మండలాల సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి మైనింగ్ రవాణా వ్యవస్థ పై కార్యచరణ చేపడతానని ఈ కమిటీ నిర్మాణానికి శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుల సహకారం అందించాలని కోరారు.

# ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సమ్మిట్లో విశాఖ అభివృద్ధి విజన్ను ఆవిష్కరించిన ఎంపీ



## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, ఆగస్టు 4 మనం న్యూస్:** రష్యా రాజధాని మాస్కోలో నిర్వహించిన 5వ ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సమ్మిట్లో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ విశాఖ నగర అభివృద్ధి విజన్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పట్టణాభివృద్ధి కార్యక్రమాలను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జీవీఎంసీ మరియు మాస్కో ప్రభుత్వాల మధ్య మెమోరాండం ఆఫ్ కోఆపరేషన్ కుదిరిందని, అనంతరం మాస్కో డిప్యూటీ మేయర్ మరియు రవాణా, రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి శాఖాధిపతి మక్సిమ్ లిక్సుటోవ్తో సమావేశమై పరస్పరం అభినందనలు తెలియజేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మార్గదర్శకత్వంలో విశాఖపట్నాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మాస్కో ప్రభుత్వంతో కుదిరిన ఈ సహకార ఒప్పందం ద్వారా ప్రపంచస్థాయి సాంకేతికతలు, వినూత్న రవాణా విధానాలు, ఉత్తమ పట్టణాభివృద్ధి నమూనాలను విశాఖకు తీసుకురావడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, సమ్మిట్ సందర్భంగా అంతర్జాతీయ ప్రతినిధులకు జీవీఎంసీ అమలు చేస్తున్న ప్రాజెక్ట్ సారథి - ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్ రవాణా వ్యవస్థ, సిగ్నల్ ఫ్రీ జంక్షన్ల అభివృద్ధి, ప్రధాన రహదారుల విస్తరణ, డిజిటల్ పౌర సేవలు, సాంకేతిక ఆధారిత తాగునీటి సరఫరా పర్యవేక్షణ, జనన-మరణ ధ్రువీకరణ పత్రాల డిజిటల్ సేవలు, స్మార్ట్ వెండింగ్ జోన్లు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ తదితర కార్యక్రమాల గురించి వివరించినట్లు తెలిపారు.

మాస్కో ప్రభుత్వంతో కుదిరిన ఈ సహకార ఒప్పందం ద్వారా స్మార్ట్ మొబిలిటీ, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్ ఎలక్ట్రిక్ రవాణా, ట్రాఫిక్ మేనేజ్మెంట్, డిజిటల్ పరివర్తన రంగాల్లో ప్రపంచస్థాయి అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకునే అవకాశం లభిస్తుందని కమిషనర్ తెలిపారు.ఈ భాగస్వామ్యం ద్వారా విశాఖలో ఆధునిక పట్టణ రవాణా పరిష్కారాల అమలుకు మరింత ఊతం లభిస్తుందని, అలాగే విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ను ఆంధ్రప్రదేశ్లో ఆర్థికాభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాస్కో డిప్యూటీ మేయర్ మక్సిమ్ లిక్సుటోవ్ మాట్లాడుతూ, భారతదేశంతో, ముఖ్యంగా విశాఖపట్నంతో ఏర్పడిన ఈ భాగస్వామ్యం ద్వారా విజ్ఞాన మార్పిడి, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్, ట్రాఫిక్ మేనేజ్మెంట్, పారిశ్రామిక సహకారం తదితర రంగాల్లో దీర్ఘకాలిక సహకారం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

## పీడీఎస్ బియ్యం రవాణా, నిల్వ మరియు విక్రయాలపై ప్రత్యేక నిఘా




**విశాఖపట్నం ఆగస్టు 4 మనం న్యూస్:** ప్రకాశ్ నగర్, సెవెన్ టెంపుల్స్ జంక్షన్ వద్ద మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. పి. శ్రీను సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించగా, ఏపీ 35వై 5394 నంబర్ గల మహీంద్రా బొలెరో వాహనం పోలీసులను గమనించి తప్పించుకునేందుకు ప్రయత్నించింది. వెంటనే వాహనాన్ని అడ్డుకొని తనిఖీ చేయగా, అందులో 30 సంచుల్లో మొత్తం 1,200 కిలోల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.వాహనంలో ఉన్న పూసర్ల అచ్చిబాబు (51), దుర్గానగర్, మల్కాపురంను అదుపులోకి తీసుకుని విచారించగా, తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి చోడవరం ప్రాంతానికి విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించాడు. పోలీసులు సుమారు రూ.18,000 విలువైన 1,200 కిలోల పీడీఎస్ బియ్యాన్ని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై మల్కాపురం పోలీస్ స్టేషన్ క్రైమ్ నెం.124/2026, సెక్షన్ 318(4) బి ఎం ఎస్ మరియు సెక్షన్ 7(1) ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మైనింగ్ రవాణా అరికట్టేందుకు కృషి చేయండి

- బిజెపి కాకినాడ పార్లమెంట్ ఇంచార్జ్ చిరుకూరి రామ్ కుమార్



**శంఖవరం ఆగస్టు 04 మనం ప్రతినిధి:** శంఖవరం రౌతులపూడి మండలాల ప్రధాన రహదారిపై ప్రయనిస్తున్న మైనింగ్ భారీ టిప్పర్ లారీల రవణాను అరికట్టాలని బిజెపి కాకినాడ పార్లమెంట్ ఇంచార్జ్ చిరుకూరి రామ్ కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను మంగళవారం సాయంత్రం చిరుకూరి రామ్కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శంఖవరం రౌతులపూడి మండలాల మీదగా వెళ్తున్న భారీ టిప్పర్ లారీల ద్వారా పర్యావరణం నశించిపోతుందని, రెండు మండలాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని రోగాల బారిన కూడా పడ్డారని తెలిపారు. త్వరలో రెండు మండలాల సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి మైనింగ్ రవాణా వ్యవస్థ పై కార్యచరణ చేపడతానని ఈ కమిటీ నిర్మాణానికి శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుల సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల కృష్ణ మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం ఉద్యమించడానికి మా కమిటీ సిద్ధంగా ఉందని ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధమని మైనింగ్ రవాణా అరికట్టేందుకు మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షులు గునపర్తి అపురూప్, కార్యదర్శి పర్వత రామకృష్ణ, సహాయ కార్యదర్శి పగడాల సన్యాసరావు, కోశాధికారి గుద్దాటి నాగేశ్వరావు, కమిటీ సభ్యులు బొర్రా వీర వేంకట రమణ,బొమ్మిడి సత్యనారాయణ,రేలంగి వెంకట సత్యనారాయణ,పడాల కృష్ణ, మొగిలి శ్రీను, ములికి అప్పారావు,కొంగు రమేష్, బత్తిన తాతాజీ, కానేటి వెంకటరమణ, గునపర్తి రాఘవ పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**విశాఖపట్నం, సీతంపేట, ఆగస్టు 5 (మనం న్యూస్):** దక్షిణ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం సీతంపేటలోని జనసేన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 22 మంది పేద లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సుమారు రూ.7 లక్షల ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని, అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం ఆంధ్రప్రదేశ్కు గర్వకారణమని ఎమ్మెల్యే తెలిపారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో భోగాపురం ఎయిర్పోర్టు గానీ, పోలవరం ప్రాజెక్టు గానీ పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అనే ద్వంద్వ లక్ష్యాలతో ముందుకు సాగుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా, సమయానికి అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు తాము కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కూటమి పార్టీల ప్రతినిధులు, లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆరిలోవ హెల్త్ సిటీ ఆసుపత్రులపై జీవీఎంసీ ఆకస్మిక తనిఖీలు

## అక్రమ బోర్వెల్ వినియోగంపై నోటీసులు

## 7 రోజుల్లో బల్క్ కనెక్షన్ తీసుకోవాలని ఆదేశం



**విశాఖపట్నం, ఆగస్టు 4:** ఆరిలోవ హెల్త్ సిటీ ప్రాంతంలోని ఆసుపత్రులు అనుమతి లేకుండా భూగర్భ జలాలను వినియోగించడంపై జీవీఎంసీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ పల్లంరాజు మంగళవారం ఆసుపత్రుల్లో తనిఖీలు చేశారు. తనిఖీల్లో పలు ఆసుపత్రులు జీవీఎంసీ బల్క్ వాటర్ కనెక్షన్ తీసుకున్నప్పటికీ వాటిని ఉపయోగించకుండా, బోర్వెల్ల ద్వారా అధికంగా భూగర్భ జలాలను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. మరికొన్ని ఆసుపత్రులు బల్క్ కనెక్షన్ కూడా లేకుండానే పూర్తిగా బోర్వెల్ నీటిపై ఆధారపడుతున్నట్లు తేలింది. ఇలా అక్రమంగా భూగర్భ జలాలను వాడటం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు తాగునీటి సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతోందని అధికారులు పేర్కొన్నారు.

**7 రోజుల్లో కనెక్షన్ తీసుకోవాలని నోటీసులు**


ఈ నేపథ్యంలో సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లోగా జీవీఎంసీ బల్క్ వాటర్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, అనుమతి లేకుండా బోర్వెల్ నీటిని వాడరాదని స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన తాగునీరు అందించడమే జీవీఎంసీ లక్ష్యమని పల్లంరాజు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులు, వాణిజ్య, ఇతర సంస్థలపై తనిఖీలు కొనసాగుతాయని, నోటీసుల తర్వాత కూడా పాటించని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు, వార్డు అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మనం వార్తతో కదిలిన యంత్రాంగం..

## వినతిపత్రం అందజేసిన ఏఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు

ముంపు గ్రామానికి త్వరిత పునర్వాసం కల్పించాలని విజ్ఞప్తి..

స్పందించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపిన బంగారు వెంకటేశ్వర్లు



**పోలవరం జిల్లా (చింతూరు, మనం న్యూస్) ఆగస్టు 4:** 'మనం'లో ప్రచురితమైన తాళ్లగూడెం గ్రామ సమస్యల వార్తకు జిల్లా యంత్రాంగం స్పందించింది. ముంపు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తాళ్లగూడెం గ్రామాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించి గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్కు పోలవరం ముంపు సమస్యలు, పునరావాసం, ఆర్ అండ్ ఆర్కు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్తో మాట్లాడుతూ, 2008లో భూములకు పరిహారం ఇచ్చినా ఇప్పటి వరకు ఇళ్లు, భూములకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందలేదని, తాళ్లగూడెం గ్రామానికి తక్షణమే పునరావాసం కల్పించాలని కోరారు. అలాగే గ్రామాన్ని చింతూరు లేదా ఎటపాక మండల పరిధిలో పునరావాసం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్, రెండో జాబితాలో తొలి ప్రాధాన్యంతో తాళ్లగూడెం గ్రామానికి పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బంగారు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 'తాళ్లగూడెం గ్రామ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చిన 'మనం' వార్తా కథనానికి స్పందించి గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, అధికారులకు గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జెట్టి వెంకటేశ్వర్లు, బంగారు రాంబాబు, బొగ్గ నాగిరెడ్డి, బొగ్గ కిష్టయ్య, జెట్టి నాంచారమ్మ, బొగ్గ బాయమ్మ, బుగ్గ అప్పారావు, బంగారు దేసయ్య, సోడే మధుసూదన్ రావు, సోడే రామయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## హిందూపురం రోటరీ క్లబ్ కు అవార్డుల పంట



**హిందూపురం (మనం న్యూస్) ఆగస్టు 4:** స్థానిక హిందూపురం రోటరీ క్లబ్ వారు గోవాలో జరిగిన రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ అవారడ్స్ కార్యక్రమంలో పలు విభాగాలలో అవార్డులు సొంతం చేసుకున్నారు. తాము చేసిన సేవలను రోటరీ ఇంటర్నేషనల్ వారు గుర్తించి బెస్ట్ కమ్యూనిటీ సర్వీసెస్ అవార్డ్, బెస్ట్ పబ్లిక్ ఇమేజ్ అవార్డ్, బెస్ట్ ఒకేషనల్ సర్వీసెస్ అవార్డ్, బెస్ట్ క్లబ్ అవార్డ్, బెస్ట్ ఎడ్యుకేషన్ అండ్ స్టూడెంట్ అవార్డు, ఆల్ కాంట్రిబ్యూటర్స్ అవార్డ్, నంబూరి సుమంత్ కు బెస్ట్ అసిస్టెంట్ గవర్నర్ అవార్డులు సొంతం చేసుకోంది.ఈ అవార్డులు పొందినందుకు తమకు ఎంతో సంతోషంగా ఉందని దీనికి కారణమైన తమ సహచర రోటరీ సభ్యులకు మాజీ రోటరీ అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్ మరియు మాజీ కార్యదర్శి శ్రీధర్ గౌడ్ లు కృతజ్ఞతలు తెలిపారు.తమ సేవా కార్యక్రమాలకు ఎంతగానో సహాయపడిన హిందూపూర్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# దళితుల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చర్యలు

**ఎండాడ, చినగదిలిలో పర్యటించిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం**



**విశాఖపట్టణం, జూలై 04:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఆధ్వర్యంలో దళితుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చినగదిలి తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యలకు సంబంధించిన పలు ఫిర్యాదులను పరిశీలించిన ఆయన, సంబంధిత ఫిర్యాదుదారులు, రెవెన్యూ అధికారులతో కలిసి ఎండాడ, చినగదిలిలోని సమస్యాత్మక భూములను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దళితులకు న్యాయం జరిగేలా ఎస్సీ కమిషన్ ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆయన పేర్కొన్నారు. గ్రీవెన్స్ లో అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. దళితుల భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, హక్కుల ఉల్లంఘనలు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిశీలిస్తామని చెప్పారు.

ఇదిలా ఉండగా ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన కార్యక్రమాలు 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జిల్లాలో కొనసాగనున్నాయి. బుధవారం సీతమ్మధార, గురువారం పెందుర్తి తహశీల్దార్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. 7వ తేదీన ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరిస్తారు. దళిత వర్గాలకు చెందిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రావాడ సీతారాం కోరారు.

# గిరిజన విద్యార్థుల సమగ్ర వికాసానికి చారిత్రాత్మక ముందడుగు



**పుట్టపర్తి, ఆగస్టు 4(మనం న్యూస్):** గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసాన్ని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో శ్రీ సత్యసాయి జిల్లా పరిపాలన మరో కీలక అడుగు వేసింది. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖ మరియు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆర్ట్ ఆఫ్ లివింగ్ మధ్య మంగళవారం ఒక సంవత్సరం కాలపరిమితితో కూడిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని 1,150 మంది విద్యార్థులు మరియు 100 మంది గురుకుల ఉపాధ్యాయులకు ఏడాది పాటు యోగా, ధ్యానం, ప్రాణాయామం, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ నైపుణ్యాలు, మానసిక ఆరోగ్య పరిరక్షణ, ఏకాగ్రత పెంపు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు.

# నీటి ఆధారం ఉన్న రైతులు పశుగ్రాసం సాగు చేయాలి: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం ఆగస్టు 4(మనం న్యూస్):** వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావంతో భవిష్యత్తులో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో విస్తృతంగా పశుగ్రాసాన్ని సాగు చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. నీటి వసతి ఉన్న ప్రతి రైతు తమ పశువులతో పాటు తోటి రైతుల పశువులకు కూడా ఉపయోగపడేలా సామూహిక పశుగ్రాస సాగు చేయాలని పిలుపునిచ్చారు. రాయదుర్గం మండల పరిధిలోని వేపరాల గ్రామ చెరువులో సామూహిక పశుగ్రాస పెంపక కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో పశువులకు అవసరమైన మేత కొరత ఏర్పడకుండా ముందుగానే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పశుగ్రాసం సాగును ప్రోత్సహించేందుకు 'హరిత గోపాలం' పథకం కింద ఎకరాకు రూ.56 వేల వరకు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పశుగ్రాసం సాగు వైపు ముందుకు రావాలని కోరారు. పశుగ్రాస సాగును ప్రోత్సహించేందుకు పశుసంవర్ధక, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు, మండల పరిషత్ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వేపరాల్ల చెరువులో 100 ఎకరాల్లో 2,000 కిలోల పశుగ్రాస విత్తనాలను సాగు చేయడం అభినందనీయమన్నారు. పశుగ్రాసాన్ని సంరక్షించేందుకు 68 మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఈ 100 ఎకరాల్లో సాగయ్యే పశుగ్రాసం విలువ సుమారు రూ.1.25 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో నీటి లభ్యత తగ్గడం వల్ల ఈ ఏడాది సాగు విస్తీర్ణంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కొంత నీరు అందుబాటులోకి వస్తున్నప్పటికీ, పంటల సాగుకు అవసరమైన స్థాయిలో నీరు లభిస్తుందా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. వేపరాల గ్రామంలో సాగు చేస్తున్న పశుగ్రాసం చుట్టుపక్కల ఐదు గ్రామాలకు చెందిన సుమారు మూడు వేల పశువులకు ఉపయోగపడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో సుమారు 58 వేల పశువులు, లక్ష 60వేల వరకు గొర్రెలు, మేకలు ఉన్నందున వాటన్నింటిని రక్షించుకోవాల్సిన అవసరం మనపై ఉందన్నారు. నీటి వసతి ఉన్న ప్రతి రైతు పశుగ్రాసం సాగు చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. వర్షాభావ పరిస్థితుల్లో బోర్లు ఎప్పుడు ఎండిపోతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. అందువల్ల తడి పంటలు సాగు చేయకుండా, ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీలైన చోట్ల పశుగ్రాసాన్ని సాగు చేస్తే మీ పశువులతో పాటు మీ గ్రామంలోని పశువులను కూడా కాపాడినవారవుతారని, అలాగే ఆదాయం కూడా వస్తుందని సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రభుత్వం సమీక్షలు నిర్వహిస్తూ, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందిస్తుందని చెప్పారు. రైతులు తమ సొంత పిల్లల్లాగా పశువులను కూడా పెంచుకుంటున్నారన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మనందరిపై ఉందన్నారు. ఈరోజు పశుగ్రాసం సాగు చేస్తేనే రేపటి పశుగ్రాస కొరతను నివారించగలమన్నారు. కావున నీటి ఆధారం ఉన్న ప్రతి రైతు పశుగ్రాస సాగుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుబ హనుమంతు,మార్కెట్ యార్డ్ చైర్మన్ యూ.హనుమంత రెడ్డి,రఘు, మాజీ సర్పంచ్ రాజశేఖర్, కేంచానపల్లి సిద్ధప్ప, మురళి,సోము నాగిరెడ్డి హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యామిత్ర కిట్లు పంపిణీ చేసిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

- ఏలేశ్వరం మండలంలో 29 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్లు అందజేత
- పుస్తకాలు,బ్యాగులు,యూనిఫామ్,` షూస్ పంపిణీ



ఏలేశ్వరం,ఆగష్టు,4:-(మనం న్యూస్): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,ఏలేశ్వరం మండల పరిధిలోని 29 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనల మేరకు విద్యార్థినీ విద్యార్థులకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి చేతుల మీదుగా కిట్లను అందజేశారు. విద్యామిత్ర కిట్లలో భాగంగా పుస్తకాలు, పాఠశాల బ్యాగులు, యూనిఫామ్,` షూస్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి,వారికి అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.భోజనం నాణ్యత,రుచిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ, ఎంఈవో అబ్బాయి,నాయకులు పలివెల శ్రీనివాస్,ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో రాజీ లేదు.. నాణ్యతలో నిర్లక్ష్యానికీ తావులేదు...

- పనుల్లో లోపాలపై అధికారులకు మంత్రి నిమ్మల హెచ్చరిక..



,పాలకొల్లు, ఆగష్టు 4,మనం ప్రతి నిధి : పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలబెట్టడమే తన లక్ష్యమని, ప్రజల రుణం తీర్చుకునేందుకు రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా పనిచేస్తున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం పాలకొల్లులో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులు, కాంట్రాక్టు సంస్థలకు పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రతి పనిని నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు.ఇమిడి సత్యనారాయణ వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాల్లో రూ.15 కోట్లతో సుందరీకరణ, రోడ్లు, డ్రైనేజీ, ప్రహరీ గోడ తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఖాళీ స్థలాల పూడిక కోసం ప్రాసెసింగ్ చేసిన మట్టి, నల్లమట్టి, ఎర్రమట్టిని మాత్రమే వినియోగించాలని ఆదేశించినప్పటికీ, అధికారులు, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతో వ్యర్థ మట్టిని వినియోగించిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే ఆస్పత్రిని సందర్శించి పరిస్థితిని పరిశీలించి, నిర్లక్ష్యం వహించిన అధికారులను, ఏజెన్సీ ప్రతినిధులను తీవ్రంగా మందలించినట్లు తెలిపారు. ఇప్పటికే వేసిన వ్యర్థ మట్టిని పూర్తిగా తొలగించి, నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని ఆదేశించామని చెప్పారు. ప్రజా ధనంతో చేపడుతున్న పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షంపై మంత్రి విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్లలో ఆస్పత్రి అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన వారు, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 50 పడకల ఆస్పత్రిని 100 పడకల స్థాయికి పెంచుతూ నూతన భవన నిర్మాణానికి రూ.12.60 కోట్ల నిధులు మంజూరు చేశామని గుర్తుచేశారు. . రానున్న రోజుల్లో పుష్కర నిధులను సమర్థవంతంగా వినియోగించి పాలకొల్లు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ డి కిరణ్ కుమార్, పబ్లిక్ హెల్త్ డి ఈ ఈ విజయ్, నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, జక్కంపూడి కుమార్, పొట్నూరి శ్రీనివాస్, బిరుదు కోట శేఖర్, ముప్పిరి సత్యనారాయణ, ధనాన్ని సూర్య ప్రకాష్, మల్లంపల్లి పకీర్ బాబు, పసుపులేటి రాజేష్ ఖన్నా, బిట్ట లక్ష్మీనారాయణ, విన్నకోట గోపి , సిహెచ్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు



యు.కొత్తపల్లి ఆగస్టు 4 (మనం న్యూస్) మూలపేట సెక్టార్ పరిధిలో మంగళవారం ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలను అంగన్వాడీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీడీపీఓ ఎం. శ్రీకళ, ఎంఓఎస్ సౌజన్య, సూపర్వైజర్లు ఎస్. లలిత, నిర్మల, గౌరీ రాజేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమని, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు.తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయని, తల్లి ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని వివరించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడంతో పాటు శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని అవగాహన కల్పించారు.

## సత్యగిరి అక్రమ తవ్వకాలపై ఆర్డీవో పరిశీలన

- అక్రమ తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించిన పెద్దాపురం ఆర్డీఓ
- త్వరలో మొక్కల పెంపకంతో సహజ సౌందర్య పునరుద్ధరణకు హామీ



అన్నవరం, ఆగస్టు 4, మనం న్యూస్ : అన్నవరం సత్యగిరి దిగువ ప్రాంతంలో జరిగిన అక్రమ తవ్వకాల వ్యవహారంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ ఈ కృష్ణమూర్తి, శంఖవరం తాసిల్దార్ ఎం సూరిబాబు, తొండంగి తాసిల్దార్ కే కాంతారావు విశ్వ హైందవ పరిషత్ నాయకులతో కలిసి అక్రమ తవ్వకాల ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు. పరిశీలన సందర్భంగా తవ్వకాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన ఆర్డీఓ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సత్యగిరి సహజ సౌందర్యాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో అతి త్వరలోనే విస్తృత స్థాయిలో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సత్యగిరి పరిరక్షణ విషయంలో పెద్దాపురం ఆర్డీఓ సానుకూలంగా స్పందించడం అభినందనీయమన్నారు. అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటామని, మొక్కల పెంపకం ద్వారా కొండ ప్రాంతాన్ని పచ్చదనంతో నింపుతామని హామీ ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. సత్యగిరి ఆధ్యాత్మిక, పర్యావరణ ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని దానిని కాపాడేందుకు అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. సత్యగిరి పరిరక్షణకు చొరవ చూపిన పెద్దాపురం ఆర్డీఓకు విశ్వ హైందవ పరిషత్ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ ఐ భాస్కర్ ప్రసాద్ రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

## తల్లి పాలు వారోత్సవాలపై అవగాహన సదస్సు



ప్రత్తిపాడు ఆగస్టు 4 మనం న్యూస్ః ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుద్ధరాజు గోపి రాజు ముఖ్య అతిథిగా హాజరైయారు. తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు.శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత అవసరమని అన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాలని, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే అందించాలని సూచించారు. తల్లిపాలపై సమాజంలో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కారే శ్రీరామ చంద్ర, మానేపల్లి సత్తిబాబు, గల్లా తాతీలు, నారిపిరెడ్డి చక్రం, నూలు వెంకట రమణ, కారే రామక్రిష్ణ, బుద్ధరాజు రామక్రిష్ణ రాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ చక్రవేణి, పీ హెచ్ సీ డాక్టర్ గీత, అంగన్వాడి టీచర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## ముర్రిపాలు ముద్దుబిడ్డ కు ఆరోగ్య వరం

- తల్లిపాలతోనే చిన్నారులకు సంపూర్ణ పోషణ
- పుట్టిన గంటలోపే ముర్రిపాలు పట్టించాలి



పోడూరు,ఆగస్టు 4 (మనం న్యూస్) : నవజాత శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని, బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రిపాలు పట్టించడం ద్వారా చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. పాలకొల్లు ప్రాజెక్టు పరిధిలో సీడీపీఓ ఉమ ఆదేశాల మేరకు మంగళవారం పోడూరు మండలంలోని పలు అంగనవాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిన్నూరు సెక్టార్ పరిధిలోని కవిటం గ్రామం పెంకుళ్లపాలెం, నల్ల వెంకయ్య చెరువు అంగనవాడీ కేంద్రాలతో పాటు గుమ్ములూరు సెక్టార్ పరిధిలోని రావిపాడు గ్రామ అంగనవాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సెక్టార్ సూపర్వైజర్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రిపాలను తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రిపాలలో శిశువుకు అవసరమైన పోషకాలతో పాటు వ్యాధులను ఎదుర్కొనే రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు ఉంటాయని వివరించారు. పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, వైద్యుల సూచన లేకుండా ఇతర ఆహార పదార్థాలు లేదా పానీయాలు ఇవ్వకూడదని తెలిపారు. ఆరు నెలలు పూర్తయిన తర్వాత తల్లిపాలతో పాటు వయసుకు తగిన అనుబంధ ఆహారాన్ని అందిస్తూ రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించవచ్చని వివరించారు. తల్లిపాలు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, మెదడు వికాసానికి దోహదపడటంతో పాటు తల్లి-బిడ్డ మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. బిడ్డకు ఎప్పుడు ఆకలి వేసినా తల్లిపాలు అందించాలని, పాలిచ్చే తల్లులు సైతం పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు అందించే సరైన విధానం, వాటివల్ల తల్లీబిడ్డలకు కలిగే ప్రయోజనాలు, శిశు సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏసీడీపీఓ పి. నాగరత్నం, సెక్టార్ సూపర్వైజర్లు కె. మోహనరాణి, జి. హేమతులసి, ఏఎన్ఎం వి. మాలిని, అంగనవాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు

## దొంగతనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఫ్రీ బస్సులు

- వృద్ధులకు,వికలాంగులకు, విద్యార్థులకు, రోగులకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్



పాలకొల్లు, ఆగష్టు 4,మనం ప్రతినిధి : ఇటీవల ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం ప్రయోజనం కంటే నష్టం ఎక్కువ చేకూర్తుందని మహిళలు నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో ఉచిత బస్సు పై మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణించడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్సులు కిక్కిరిసి పోవడంతో మహిళల బంగారు ఆభరణాలు, పర్సులు, నగదు పోగొట్టుకుంటున్నట్లు అధిక సంఖ్యలో మహిళలు వాపోతున్నారు. ఈ ఫ్రీ బస్సు పథకం అన్న వస్త్రాలు వెళితే ఉన్న వస్త్రాలు పోయినట్లు చందంగా మారిందని పలువురు అంటున్నారు. ఈ ఫ్రీ బస్సు వల్ల ఏదైనా ఒక పని కోసం ఒకరు వెళితే మరి ముగ్గురు నలుగురిని కూడా తీసుకెళ్తున్నట్లు చెబుతున్నారు. దీంతో బస్సు ఎక్కే పురుషులకు గాని, వికలాంగులకు గాని, రోగులకు గాని, వృద్ధులకు గాని,విద్యార్థులకు గాని సీట్లు దొరక నానా అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. ఒక్కోసారి తోపులాట జరిగి పలువురు గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయని మరికొందరు చెప్తున్నారు. ఒక్కోసారి అయితే మహిళలు మహిళలు . సీట్లు కోసం జుట్లు పట్టుకుని కొట్టుకునే దుస్థితి కూడా ఏర్పడుతోందని మరికొందరు చెప్తున్నారు.ఉచిత బస్సు సౌకర్యం క్రింది వారికి మాత్రమే పరిమితం చేయాలి: ఏపీ రాష్ట్రానికి వందల కోట్లు నష్టం తెచ్చి పెడుతున్న ప్రయోజనం మాత్రం అంతగా ఉండటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఉచిత బస్సులో ప్రయాణిం చేటప్పుడు నగదు, బంగారు ఆభరణాలు,పర్సులు పోగొట్టుకోవాల్సి వస్తుందని పలువురు చెబుతున్నారు. అందువల్ల ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని కేవలం వికలాంగులకు, వృద్ధులకు, రోగగ్రస్తులకు, విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని పలువురు కోరుతున్నారు. దీనివల్ల దొంగతనాలకు లోను కాకుండా ప్రయాణికులకు, అలాగే పై వారందరికీ మంచి ప్రయోజనం చేకూరుతుందని, లోటు బడ్జెట్ లో ఉన్న ప్రభుత్వానికి కూడా వ్యయం కలిసొస్తుందని దీనికోసం ఈ దిశగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులు మొత్తం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నిరంతరం ఆచంట నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తాను



- ఎం ఎల్ ఏ పితాని సత్య

ఆచంట ఆగస్టు 4 మనం న్యూస్: రాజకీయ పార్టీలకు అతీతంగా ఆచంట నియోజకవర్గం ప్రజలకు నిరంతరం సేవ చేస్తాను అని ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు ఆచంట మండలం కొడమంచిలి గ్రామపంచాయతీ పరిధిలోని మెట్లపాడు మరియు చింతల తోట ప్రాంతాల్లో పితాని గడపగడపకు వెళ్లి సంక్షేమం అభివృద్ధి పొందారా లేదా అని గ్రామస్తులను నేరుగా అడిగి తెలుసుకున్నారు గ్రామీణ ప్రజలతో మాట్లాడుతున్నప్పటికీ నియోజవర్గ ప్రజలు ఏ ప్రాంతం నుంచి ఫోన్ చేసిన రిసీవ్ చేసుకుని నేనున్నాను ఏ సమస్య తలెత్తిన పరిష్కరిస్తాను అని అని ఎమ్మెల్యే పితాని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆచంట మండల ఆయా శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మళ్లీ మొదలైన బొండి ఇసుక తవ్వకాలు

- అప్పుడు లారీలు ఇప్పుడు టాక్టర్లు



యు.కొత్తపల్లి అగస్ట్ 4 (మనం న్యూస్): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం పొన్నాడ పంచాయతీ కోనపాపేట పరిసర ప్రాంతాల్లో అక్రమ బొండి ఇసుక తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొంది మాత్రమే బొండి ఇసుక తవ్వకాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక లోతులో బొండి ఇసుకను తవ్వడం వల్ల భూకుంగే ప్రమాదం ఉందని, భూసారం దెబ్బతిని వ్యవసాయ భూముల ఉత్పాదకత తగ్గే అవకాశం ఉందని పలువురు మేధావులు, రైతులు అభిప్రాయపడుతున్నారు. నియంత్రణ లేకుండా జరుగుతున్న తవ్వకాల కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు.

బొండు మట్టి ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవుః తాసిల్దార్ చిన్నారావు బొండు ఇసుక తవ్వకాలకు ఇటువంటి అనుమతులు లేవని అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తాసిల్దార్ చిన్నారావు పేర్కొన్నారు

## పంటల బీమాపై రైతులకు అవగాహన సదస్సు




యు.కొత్తపల్లి అగస్టు 4 (మనం న్యూస్):కొత్తపల్లి మండలం ఎండపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంతో పాటు పంటల బీమాపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కొత్తపల్లి మండల జనసేన పార్టీ ఇన్చార్జి రావు అక్షయ్, గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మురాలశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు, పంటల బీమా వంటి అంశాలపై అవగాహన కల్పించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పి-4 కార్యక్రమంలో భాగంగా సత్యవతి అనే మహిళను దత్తత తీసుకుని ఆమెకు నిత్యావసర సరుకులు, మందులు అందజేసినట్లు చెప్పారు.రావు అక్షయ్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా, బలహీనంగా ప్రవేశించడం వల్ల జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం కంటే భారీ లోటు ఏర్పడిందని, దీనివల్ల పంటలకు నష్టం సంభవించే అవకాశం ఉన్నందున రైతులంతా తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు.

## స్వామి దయానంద సరస్వతి ఆశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు,టేబుల్స్ అందజేత



ఏలేశ్వరం,ఆగష్టు,4:-(మనం న్యూస్):స్థానిక స్వామి దయానంద సరస్వతి ఆశ్రమానికి సిరి ఫాస్ట్ ఫుడ్ కృష్ణ తోడల్లుడు కోరుప్రోలు సతీష్,కుమారి దంపతుల కుమార్తె రిషిత పుట్టినరోజు సందర్భంగా డొక్కా సీతమ్మ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో నాలుగు సీలింగ్ ఫ్యాన్లు,రెండు భోజనం బల్లలను ఉచితంగా ఆశ్రమం వార్డెన్ నల్ల చంద్రశేఖర్ కు మంగళవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యులు గోవిందు, కే సాయి,పంపనబోయిన బుజ్జి,సాయి,ఆకుల సూరిబాబు, ఎస్ సుబ్రహ్మణ్యం,ఎస్ సాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయ రోడ్లు అస్తవ్యస్తం

- ఎం ఎల్ ఏ పితాని అభివృద్ధి చేయాలి
- వినియోగదారులు విజ్ఞప్తి

ఆచంట ఆగస్టు 4 మనం న్యూస్: నియోజకవర్గ కేంద్రమైన ఆచంట విద్యుత్ సబ్ స్టేషన్ మరియు గృహ నిర్మాణ శాఖ ఏఈ ప్రభుత్వ కార్యాలయాలు రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి అని స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అభివృద్ధి చేయాలని కరెంట్ బిల్లు చెల్లించే వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు ఈ సందర్భంగా వినియోగదారులు మాట్లాడుతూ ఆచంట నియోజవర్గ ప్రాంతాలు అభివృద్ధి చెందాలి అంటే ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ వల్లే సాధ్యం అవుతుందని స్థానికులు రాజకీయ పరిశీలకులు అంటున్నారు ప్రభుత్వ కార్యాలయాల రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే పితాని దృష్టి సారించి అభివృద్ధి చేయాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు

## బాలిక ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల పంపిణీ



ఏలేశ్వరం,ఆగష్టు 04(మనం న్యూస్ ):స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రాజశ్రీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు బోదిరెడ్డి గోపాలకృష్ణ,ముది నారాయణస్వామి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనల మేరకు ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు.అలాగే కూటమి ప్రభుత్వంలో పాఠశాలలు చక్కగా రూపుదిద్దుకోవడం జరిగిందని,కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పసుపులేటి శ్రీను,వైస్ చైర్మన్ జామి గోవిందమ్మ, మాజీ కౌన్సిలర్లు పెంద్ర శ్రీను,ఎండుగుండీ నాగబాబు,కోణాల వెంకటరమణ, సిహెచ్సి చైర్మన్ వాగు రాజేష్ ,సిహెచ్సి వైస్ చైర్మన్ జొన్నాడ వీరబాబు, సామంతులు గోపి, బుగత శ్రీను, వాగు బద్రిస్,కోట్ల కృష్ణ తదితర టిడిపి నాయకులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లిపాలు అమృతంతో సమానం ఎంపీపీ

ఏలేశ్వరం,ఆగష్టు,04(మనం న్యూస్):ప్రతి చంటి బిడ్డకు తల్లిపాలుతోనే సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని అందువల్లే తల్లిపాలు అమృతంతో సమానం అని కాకినాడ జిల్లా ఎంపీపీ సమైక్య అధ్యక్షుడు ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) పిలుపునిచ్చారు.ప్రపంచ తల్లిపాలు వారం (ఆగస్టు 1 నుండి 7 వరకు) సందర్భంగా జె అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు తల్లిపాలు ఇవ్వడంపై అవగాహన కల్పించడమే కాకుండా కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ చంటి బిడ్డలకు తల్లిపాలు పట్టాలని కోరారు. జె అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రకారం వైద్యులు బి జయరామ్ పీహెచ్సీ, ప్రభుత్వం ఉన్నత పాఠశాల,మండల పరిషత్ పాఠశాలలో టీనేజ్ ప్రెగ్నెన్సీలు, బాల్య వివాహాలు - వాటి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, చైల్ సెక్స్ రేషియో (లింగ నిష్పత్తి) మరియు పీసీపీఎన్డీటీ చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,గ్రామ పెద్దలు, మండల విద్యాశాఖ అధికారి బి అబ్బాయి,జె.అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



## ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యం

**మహానంది, ఆగస్టు4,మనంన్యూస్.** ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యమని సూపర్ వైజర్ కవిత,మహిళా సంరక్షణ కార్యదర్శి ఉమామహేశ్వరి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మహానంది మండల పరిధిలోని బుక్కాపురం, తిమ్మాపురం, గాజులపల్లి, సీతారామాపురం, అబ్బీపురం,తదితర గ్రామాలలో బాలింతలకు, గర్భవతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి వద్ద ముర్రుపాలు తాగించడం ఎంతో శ్రేయస్కరమన్నారు.అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కళావతి, చండీ దేవి, నారాయనమ్మ, హుస్సేనమ్మ, చంద్ర లీల,తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు మేలు



**మంత్రాలయం , ఆగస్టు 4,మనం న్యూస్ ;-** గ్రామాలోని రైతులు ఎల్ నినో ప్రభావం కారణంగా ప్రత్యామ్నాయ పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ నసీరుద్దీన్ ,డాక్టర్ చైతన్య , డాక్టర్ సతీష్ బాబు, మండల వ్యవసాయ మండల అధికారి జీరా గణేష్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిలకలడోణ , మాలపల్లి , చెట్నెహళ్ళి ,రచ్చుమర్రి , పరమాన్ దొడ్డి తాండ , సుంకేశ్వరి , మాధవరం కల్లుదేవకుంట గ్రామాల్లో ఎల్ నినో నేపథ్యంలో శాస్త్రవేత్తలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల, కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి మరియు వ్యవసాయ శాఖ, కర్నూలు ఆధ్వర్యంలో మంత్రాలయం మండలంలో వివిధ గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలు సందర్శించి ఎల్ నినో పై రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ పంటలలో బెట్టను తట్టుకునే యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించడం జరిగింది.


## బాధితులు పరామర్శించిన ఏపిటూరిజం చైర్మన్



● నూకసారి బాలాజీ


**కర్నూలు ఆగస్ట్ 04మనం న్యూస్ :** ఆలూరులో టిడిపి కార్యకర్తలపై జరిగిన దాడిని ఖండిస్తూ బాధితులని పరామర్శించడానికి పై మాన్ కమిటీ నేడు ఆలూరు వచ్చారు ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఈ విధంగా దాడులు చేయడం సమంజసం కాదని అన్నారు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టేలా చూస్తామని చెప్పారు టిడిపి కార్యకర్తలు సమన్వయం పాటించాలని అన్నారు అనంతరం కర్నూల్ లోని ఏపి టూరిజం హోటల్లో డివిజన్ మేనేజర్ లక్ష్మీనారాయణ సిబ్బంది ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు అయినా రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ అనంతపూర్ జిల్లా ఆంధ్ర ప్రదేశ్ లేబర్ కార్పొరేషన్ చైర్మన్ శివుడు యాదవ్ కర్నూలు జిల్లా టిడిపి సీనియర్ నాయకుడు మాధవరావు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయి స్టేడియం ఏర్పాటు చేయాలి




**ఎమ్మిగనూరు ఆగస్టు 4 మనం న్యూస్** పట్టణంలోని విద్యార్థులు, యువత చదువుల ఒత్తిడి, సాంకేతిక జీవనశైలి కారణంగా మెకానికల్ జీవితాన్ని గడుపుతున్నారు. వారి శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని, అందుకు తగిన క్రీడా మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. మండల పరిధిలోని బనవాసి గ్రామంలో 50 ఎకరాల ప్రభుత్వ భూమిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమగ్ర క్రీడా స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థులు, యువత, క్రీడాభిమానులు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇందులో అథ్లెటిక్స్ ట్రాక్, క్రికెట్, ఫుట్బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో మైదానాలతో పాటు ఇండోర్ స్టేడియం, జిమ్నాసియం, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# వర్షాల కోసం శక్తి స్వరూపిణి శ్రీ బంగారమ్మ అవ్వ తల్లికి కాయి యాడ సమర్పణ



**మంత్రాలయం,ఆగస్టు 4 మనం న్యూస్:** కర్నూలు జిల్లా, మంత్రాలయం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ గ్రామదేవత ₹శక్తి స్వరూపిణి శ్రీ బంగారమ్మ అవ్వ తల్లికి₹ మంగళవారం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో కాయి యాడ సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ పెద్దల పిలుపు మేరకు గ్రామంలోని ప్రతి కుటుంబం పెద్ద సంఖ్యలో పాల్గొని ₹బొబ్బట్లు , టెంకాయలు₹ సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తి అమ్మవారిని వేడుకోగా, గ్రామస్థులు గ్రామానికి మంచి వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని హృదయపూర్వకంగా ప్రార్థించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, గ్రామ సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పాల్గొనడం ఆనందదాయకమని తెలిపారు. అమ్మవారి అనుగ్రహంతో త్వరలోనే మంచి వర్షాలు కురిసి గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు, యువకులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# వైసిపి వీడి తెలుగుదేశం పార్టీలో చేరిక

### తెలుగుదేశం పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి చూసి పార్టీలోకి చేరిక



**బేతంచేర్ల ఆగస్ట్ 4 (మనం న్యూస్ )** మండల పరిధిలోహుస్సేనాపురం గ్రామానికి చెందిన దాదాపు 22 కుటుంబాలు వైఎస్సార్సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు మండల అధ్యక్షులు ఎల్ల నాగయ్య బందకటి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని హుస్సేనాపురం గ్రామానికి చెందిన దాదాపు 22 కుటుంబాలు వైఎస్సార్సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు ఈ సందర్భంగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కొత్తగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి హర్షపూర్వకంగా ఆహ్వానించారు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం మరియు డోన్ ఎమ్మెల్యే అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలపై విశ్వాసంతోనే ప్రజలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సోమశేఖర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రం అభివృద్ధిలో ఉండాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండాలి



- **ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి**
- **రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటికి తెలుగుదేశం**

**బేతంచేర్ల ఆగస్ట్ 4 (మనం న్యూస్)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2 ఏళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాల మేరకు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి డోన్ నియోజకవర్గ అడ్వైజర్ గోవర్ధన్ రెడ్డి బేతంచేర్ల మండల పరిధిలో పాపసాని కొట్టాల హుసేనాపురం తవసి కొండ గ్రామాలలో సంక్షేమ అభివృద్ధి ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కూటమి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఈ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు తెలుపుతూ వారి సమస్యలను అధికారులకు తెలిపి వారి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు రాష్ట్రం అభివృద్ధిలో ఉండాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండాలి గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల్లో అందుబాటు ఉండి సమస్యలు పరిష్కరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఉన్నాం ఎల్ల నాగయ్య సోమశేఖర్ రెడ్డి మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు భీమేష్ రెడ్డి బిజెపి నాయకులు నాగమోహన్ గాజుల రమేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# సిపిఐ పాదయాత్రలు జయప్రదం చేయండి




**కర్నూలు ఆగస్ట్ 04మనం న్యూస్ :** 12 సంవత్సరాల బిజెపి పరిపాలన కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడంతో ₹మార్పు కావాలి అనే నినాదంతో₹ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఆగస్టు 6 నుండి 15 జరిగే పాదయాత్రాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య పిలుపునిచ్చారు మంగళవారం నాడు స్థానిక సీఆర్ భవన్ నందు జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో గిద్దయ్య మాట్లాడుతూ బిజెపి పరిపాలన కాలంలో ప్రజల మధ్య మతాల పేరుతో చిచ్చు పెడుతూ అభివృద్ధిని విస్మరించిందని ప్రశ్నించే వారిని దేశద్రోహులంటూ నిర్బంధాలకు గురి చేస్తుందని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ నియంతృత్వంగా వ్యవహరిస్తుందని వీరి పాలన కాలంలో దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయిలో పెరిగిపోవడమే కాకుండా పరీక్ష పత్రాల లీకు లతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, మహిళలకి ఆదివాసులకి రక్షణ లేకుండా పోయిందని ఇలాంటి తరుణంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలలో చైతన్యం పెంచి మార్పు కావాలన నినాద ంతో ఆగస్టు 6 నుండి 15 వరకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు.

# సీడీపీఓ మద్దెమ్మపై ఆరోపణలు పూర్తిగా అవాస్తవం



**అస్పరి ఆగస్ట్ 04మనం న్యూస్ :** కర్నులు జిల్లా ఆస్పరి ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సిడిపిఓ మద్దమ్మ పై కొందరు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని పూర్తి అవాస్తవమని దేవనకొండ తెర్నెకల్, అస్పరి, బిల్లేకల్ నాలుగు సెక్టార్ల పరిధిలోని అంగన్వాడి టీచర్లు హెల్పర్లు పేర్కొన్నారు. మంగళవారం అంగన్వాడి టీచర్లు జ్యోతి, సుజాత, నాగమణి ప్రమీల, చిట్టెమ్మ, మెహరీన్ భీ ల ఆధ్వర్యంలో వారు మీడియాతో మాట్లాడుతు గత నెల 21వ తేదీన ప్రాజెక్టు మీటింగ్లో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ కు కోటకొండ సెక్టార్ కు చెందిన కొందరూ సిడిపిఓ మద్దమ్మ పై ఆరోపణలు చేయడం జరిగిందని అవి పూర్తిగా అవాస్తమన్నారు. సీడీపీఓ వలన 131 సెంటర్లలో 110 అంగన్ వాడి సెంటర్ల టీచర్లకి, ఆయాలకు ఎటువంటి సమస్యలు లేవని పేర్కొన్నారు.

## ఘనంగా తల్లిపాల వార్షికోత్సవాలు



**ఎమ్మిగనూరు ఆగస్టు 4 మనం న్యూస్** మండల పరిధిలోని పెసలదిన్నె గార్లదిన్నె గ్రామాల్లో స్థానిక అంగనవాడి సెంటర్ల ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు తిప్పమ్మ, రంగమ్మ అధ్యక్షతన ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లిపాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు ముఖ్య అతిథులుగా సూపర్వైజర్ వైలప్రీతి హాజరు కావడం జరిగింది ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టినటువంటి పిల్లలకు మురిపాలు పట్టించడం తల్లిపాలలో ఉన్న ఆరోగ్య ప్రయోజనాల పై గర్భవతులకు అవగాహన కల్పించారు పుట్టిన గంటలోపు తల్లి పాలు తాగడం వలన రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందని గర్భిణీలు బాలింతలు పోషక విలువలు కలిగినటువంటి ఆహారాన్ని తీసుకున్నప్పుడే బిడ్డలు ఆరోగ్యం వంతంగా ఉంటారని వారు తెలిపారు అదేవిధంగా ప్రభుత్వం గర్భిణీ స్త్రీలకు బాలింతలకు వివిధ రకమైనటువంటి పథకాలను ప్రవేశపెట్టి వారు బలంగా ఉండటానికి మంచి పోషకాలైనటువంటి వివిధ రకమైనటువంటి కిట్లను కూడా పంపిణీ చేయడం జరుగుతుంది శ్రీ బలంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది అని వారు అన్నారు అనంతరం గర్భిణీ స్త్రీ లతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

## అనారోగ్యంతో బాధపడుతున్న రాఘవకు ఆర్థిక సాయం



**ఏలేశ్వరం,ఆగస్టు,4:-(మనం న్యూస్):** మానవత్వాన్ని చాటుతూ ఏలేశ్వరం పట్టణంలోని చైతన్య నగర్ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న చందక రాఘవకు సిరి ఫాస్ట్ ఫుడ్ అధినేత పెచేటి కృష్ణ కుటుంబ సభ్యులు చేయూత అందించారు. తన కుమార్తె రిషిత పుట్టినరోజు సందర్భంగా మంగళవారం 26 కిలోల బియ్యం బస్తాతో పాటు కొంత నగదు అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పెచేటి కృష్ణ మాట్లాడుతూ, కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాఘవకు తమ వంతు సహాయంగా బియ్యం, నగదు అందజేసినట్లు తెలిపారు. సమాజంలో ఆర్థికంగా స్థోమత ఉన్న దాతలు ముందుకు వచ్చి రాఘవకు చేయూతనందించాలని, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొరుప్రోలు సతీష్, డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యులు గోవిందు, కే. సాయి, పంపనబోయిన బుజ్జి, సాయి, ఆకుల సూరిబాబు, ఎస్. సుబ్రహ్మణ్యం, ఎస్. సాయి తదితరులు పాల్గొని రాఘవకు ధైర్యం చెప్పారు. స్థానికులు పెచేటి కృష్ణ కుటుంబం చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

## మూడు చక్రాల మోటార్ సైకిల్ పంపిణీ



**ఎమ్మిగనూరు ఆగస్టు 4 మనం న్యూస్** మండల పరిధిలోని కడిమెట్ల గ్రామానికి చెందిన మాదిగ సంపత్ మూడు చక్రాల మోటార్ సైకిల్ను అందుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం తనకు ఎంతో ఉపయోగపడే ఈ వాహనం అందించిన కూటమి ప్రభుత్వానికి, అలాగే ఈ సౌకర్యం కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి కృతజ్ఞతలు తెలియజేస్తూ, శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దివ్యాంగుల స్వావలంబన, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఎమ్మిగనూరు ఆగస్టు 4 మనం న్యూస్** పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సు సర్వీసులను ఎమ్మెల్యే డా. బి.వి. జెండా ఊపి ప్రారంభించారు ప్రారంభించిన సర్వీసుల్లో ఎమ్మిగనూరు - విజయవాడ సూపర్ లగ్జరీ బస్సు మరియు ఎమ్మిగనూరు - ఆదోని పల్లెవెలుగు బస్సు ఉన్నాయి. ఏపీఆర్ఎస్ మరియు ఏపీఆర్జేసీ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ప్రత్యేక విజ్ఞప్తి మేరకు ఈ సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు మరియు సాధారణ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి



**పెనుకొండ ఆగస్టు 4 మనం న్యూస్:** భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే గ్రామదేవత కొల్లాపురమ్మ జాతరలో మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ పాల్గొన్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు గొందిపల్లి గ్రామానికి చేరుకున్న ఆమెకు నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గొందిపల్లి గ్రామంలోని కొల్లాపురమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉషశ్రీ చరణ్, గ్రామ ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. అనంతరం నాయకులు ఏర్పాటు చేసిన విందులో పాల్గొని గ్రామస్తులతో ఆప్యాయంగా మమేకమయ్యారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పుప్పం సుధాకర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, పెనుకొండ నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ సల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, దుద్దేబండ మాజీ సర్పంచ్ గౌతమి శ్రీకాంత్ రెడ్డి, సోమందేపల్లి జడ్పీటీసీ అశోక్, మాజీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, గుట్టూరు ఎంపీటీసీ నిర్మల నారాయణస్వామి, గొందిపల్లి చంద్రశేఖర్ రెడ్డి, అంజన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, అభిషేక్ రెడ్డి, వీరనారాయణ రెడ్డి, అశ్వత్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరుణుడి కరుణ కోసం కరువు రాయికి పూజలు



**గుడిబండ ఆగస్టు 4 మనం న్యూస్:** వర్షాలు లేక విలవిలలాడుతున్న ప్రజానీకం వరుడు కరుణిస్తాడన్న నమ్మకంతో గ్రామాల్లో వివిధ రకాల పూజలు నిర్వహిస్తున్నారు. ప్రకృతి వర్షాలు లేకపోవడంతో పచ్చని చెట్లు, పశువులు తినే గడ్డి ,బోరు బావుల్లో నీరు ఎండిపోయాయి. పొలాల్లో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. కరువు తాండవం ప్రారంభం అవుతుందేమోనని ఆందోళన ప్రజల్లో రేకెత్తుతోంది. ఈ తరుణంలో గ్రామాల్లో గాడిదలకు పూజలు, చెరువుల్లో ప్రార్థనలు, ఇళ్ళ ముందర ముద్దు మారమ్మలు, కరువు రాళ్లకు పూజలు పూజలు గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. ఇలాంటి పూజలే గుడిగంట మండలం చిగతుర్పి గ్రామంలో మంగళవారం నిర్వహించారు . గ్రామం నడిబొడ్డున ఉన్న కరువు రాయికి 101 బిందెలతో నీటి అభిషేకం నిర్వహించారు. పూజలు చేశారు. తదనంతరం గ్రామ దేవత అయిన కొల్లాపూరమ్మకు విశేష పూజలు నిర్వహించారు. ముద్ద మారమ్మలకు పూలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు



● తహసీల్దార్ ఎం. సూర్యప్రభ

**ప్రత్తిపాడు, ఆగస్టు 04 మనం న్యూస్:** కష్టపడే తత్వంతో పాటు క్రమశిక్షణతో చదివితే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం. సూర్యప్రభ అన్నారు. మంగళవారం లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె, విద్యార్థులకు ప్రేరణాత్మక మార్గదర్శనం చేశారు. తాను ప్రైవేట్గా ఇంటర్, డిగ్రీ చదువుతూ, ట్యూషన్లు చెప్పుకుంటూ స్వయంకృషితో ఈ స్థాయికి చేరుకున్నానని తన జీవిత అనుభవాన్ని పంచుకున్నారు. లంపకలోవ హైస్కూల్ ఎంతో క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పాఠశాలని ప్రశంసించారు. ఫోన్ వ్యసనానికి, టీనేజ్ ఆకర్షణలకు దూరంగా ఉంటూ సాంకేతికతను కేవలం చదువుకే ఉపయోగించాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ, అబ్బాయిలు తోటి విద్యార్థినులను సోదరీమణుల్లా భావించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం



**కర్నూలు ఆగస్ట్ 04మనం న్యూస్:** మహాత్మ జ్యోతి రావు పూలే గురుకుల పాఠశాలను పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్. షాబీర్ భాష ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసులు అన్నారు. మంగళవారం వారు ఓ ప్రకటన ద్వారా తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పత్తికొండ నియోజకవర్గానికి కేటాయించిన మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను నియోజకవర్గ కేంద్రంలో నిర్మించకుండా, స్థానిక ఎమ్మెల్యే తన యొక్క స్వార్థ ప్రయోజనాల దృష్ట్యా, స్వగ్రామం కంబాలపాడు గ్రామంలో ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.పత్తికొండ నియోజకవర్గం కేంద్రంలో ఏర్పాటు చేయడం ద్వారా పరిసర గ్రామీణ ప్రాంత విద్యార్థులందరూ కూడా అందుబాటులో ఉంటుందని, రవాణా సౌకర్యం మరి యు అధికారుల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు.

## రైస్ గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్



**ఓడి చెరువు ఆగస్టు 4 మనం న్యూస్ :** ఓ డి చెరువు మండల కేంద్రంలోని రైస్ కూడా గిడ్డంగిని మంగళవారం శ్రీ సత్య సాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. మండల తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి స్టాక్ పాయింట్ నందు నిల్వ ఉన్న స్టాక్ ను పరిశీలించారు. స్టాక్ పాయింట్ నుంచి చౌకదాన్ని డిపోలకు తరలిస్తున్న నిత్యవసర వస్తువుల వివరాలను సంబంధిత రికార్డులను పరిశీలించారు. కొత్తగా వచ్చిన క్యూ ఆర్ బేస్డ్ పీడీఎస్ పంపిణీ విధానం పై సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొండకమర్లలోని చౌక ధాన్యపు డిపోకి వెళ్లి తనిఖీ చేశారు. రైతులకు తూకాలు సక్రమంగా వేయించి సకాలంలో బియ్యాన్ని అందించాలని సూచించారు.

## ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన



**రాయదుర్గం ఆగష్టు 4 మనం న్యూస్,** ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమతుల్యంగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని భం భం స్వామి లే అవుట్ లో మంగళవారం నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తోందన్నారు. ప్రభుత్వ పాలనకు అన్ని వర్గాల ప్రజలు అడుగడుగునా అండగా నిలుస్తూ, ఆశీర్వదిస్తున్నారన్నారు. 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలుస్తున్నప్పుడు ప్రతి ఇంటి నుంచి తమకు అపూర్వమైన ఆదరణ లభిస్తోందని చెప్పారు.

# మంచు మనోజ్ 'వడ్డీ కాసులవాడ'లో కోలీవుడ్ హీరో

మంచు మనోజ్, ప్రస్తుతం తన సెకండ్ ఇన్నింగ్స్ లో వరుస సినిమాలతో ఫుల్ ఫామ్ లో దూసుకుపోతున్నారు. ఇటీవల 'భైరవం' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చిన ఆయన బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకోవడమే కాకుండా, ఆ తర్వాత చేసిన 'మిరాయ్' సినిమాతో కూడా బాక్సాఫీసు వద్ద భారీ సంచలనాన్ని సృష్టించారు. అదే జోష్తో ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్రలలో



డేవిడ్ రెడ్డి, వడ్డీ కాసులవాడ వంటి విభిన్నమైన ప్రాజెక్టులలో నటిస్తూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వీటిలో పూర్తి ఫన్ అండ్ ఆద్యంతం అలరించే ఎంటర్ టైన్ మెంట్ నేపథ్యంలో రాబోతున్న 'వడ్డీ కాసులవాడ' చిత్రానికి తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్నారు. వరుస బ్లాక్ బస్టర్ హిట్లతో మంచి ఫామ్ లో ఉన్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై నిర్మాత అనిల్ సుంకర ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మంచు మనోజ్ కెరీర్ లో చిరస్థాయిగా నిలిచిపోయిన 'బిందాస్' సినిమా తర్వాత దాదాపు 16 ఏళ్లకు నిర్మాత అనిల్ సుంకరతో ఆయన మళ్లీ కలిసి వర్క్ చేస్తుండటం విశేషం. ఒక సామాన్య మానవుడు తన నిత్యజీవితంలో ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోరాటాల నేపథ్యంలో ఈ చిత్రం రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ దక్కగా, ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఒక క్రేజీ వార్త నెట్టింట బాగా హల్ చల్ చేస్తోంది. ఇందులో కోలీవుడ్ స్టార్ హీరో రవి మోహన్ వెంకటేశ్వర స్వామి పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఆ ప్రత్యేక పాత్ర కోసం మూవీ టీమ్ ఆయనను సంప్రదించగా, కథ, తన క్యారెక్టర్ డిజైన్ ఎంతగానో నచ్చడంతో నటించేందుకు ఆయన వెంటనే ఒప్పుకున్నట్లు టాక్ నడుస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా చిత్రయూనిట్ నుంచి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

# బీసీసీఐ పెన్షన్ ఎంత.. ఎవరెవరికి వస్తుంది..?

అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించడంతో బీసీసీఐ మాజీ క్రికెటర్లకు అందించే పెన్షన్ పథకం మరోసారి చర్చలోకి వచ్చింది. 2004లో ప్రారంభమైన ఈ పథకంలో సుమారు 900 మంది మాజీ క్రికెటర్లు, అంపైర్లు, ఇతర అధికారులు ప్రయోజనం పొందుతున్నట్లు సమాచారం.

మొదటల్లో కనీసం ఒక టెస్టు మ్యాచ్ ఆడిన మాజీ క్రికెటర్లకు నెలకు రూ.5,000 పెన్షన్ అందించేవారు. 2022లో బీసీసీఐ పెన్షన్ మొత్తాలను భారీగా పెంచింది. దీంతో సుమారు 900 మంది మాజీ క్రికెటర్లు, అంపైర్లు, అధికారులు లబ్ధి పొందారు.



### ప్రస్తుతం క్రికెటర్ల నెల పెన్షన్ ఎంత..?

25 లేదా అంతకంటే ఎక్కువ టెస్టులు ఆడిన పురుష క్రికెటర్లు- రూ.70,000

ఇతర మాజీ పురుష టెస్టు క్రికెటర్లు- రూ.60,000

మాజీ మహిళా అంతర్జాతీయ క్రికెటర్లు- రూ.52,500

2003కు ముందు రిటైరైన ఫస్ట్ క్లాస్ క్రికెటర్లు- రూ.45,000

ఇతర మాజీ ఫస్ట్ క్లాస్ క్రికెటర్లు- రూ.30,000

### జీవితాంతం వస్తుందా..?

అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం, పెన్షన్ సాధారణంగా శాశ్వతంగా రద్దు కాదు. అయితే మాజీ క్రికెటర్ లేదా అధికారి బీసీసీఐ లేదా రాష్ట్ర క్రికెట్ సంఘంలో జీతభత్యాలు తీసుకునే పదవిలో చేరితే, ఉదాహరణకు కోచ్, సెలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ వంటి బాధ్యతలు చేపడితే, పెన్షన్ చెల్లింపులో తాత్కాలిక విరామం ఉండవచ్చు.

### పెన్షన్ పొందుతున్న ప్రముఖ క్రికెటర్లు..?

పెన్షన్ పొందుతున్న మాజీ క్రికెటర్ల జాబితాను బీసీసీఐ అధికారికంగా వెల్లడించలేదు. అయితే అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, పెన్షన్ అర్హత ఉన్న ప్రముఖ మాజీ క్రికెటర్లలో ప్రస్తుతం సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్ వంటి వారు ఉంటారు.

### అజింక్య రహానేకు ఎంత..?

రహానే భారత్ తరఫున 85 టెస్టులు ఆడాడు. కాబట్టి అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత అత్యధిక రూ.70,000 నెలవారీ పెన్షన్ బ్రాకెట్ కు అర్హత పొందుతాడు.

## పాకిస్థాన్ బాక్సర్ మిస్సింగ్

కామన్వెల్త్ గేమ్స్ 2026 తర్వాత పాకిస్థాన్ బాక్సర్ కుద్రతుల్లా మిస్ అయినట్లు తెలుస్తోంది. పోటీలు ముగిసిన అనంతరం టీమ్ హోటల్ నుంచి వెళ్లిన అతడు అదృశ్యమైనట్లు సమాచారం. అతని పాస్ పోర్ట్ కూడా టీమ్ మేనేజర్ వద్దే ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇదే తొలిసారి కాదు**

అంతర్జాతీయ టోర్నీల సమయంలో పాకిస్థాన్ బాక్సర్లు అదృశ్యమైన ఘటనలు గతంలోనూ చోటుచేసుకున్నాయి. 2022 కామన్వెల్త్ గే వ్ ం ్



సందర్భంగా సులేమాన్ బలోచ్, నజీరుల్లా ఖాన్ బర్మింగ్ హామ్ లో అదృశ్యమయ్యారు. అప్పట్లోనూ వారి పాస్ పోర్టులు మేనేజర్ వద్దే ఉన్నట్లు సమాచారం.

2024లో ఇటలీలో జరిగిన వరల్ ఒలింపిక్ క్వాలిఫయర్స్ సందర్భంగా ఆసియా గోల్ మెడలిస్ట్ బాక్సర్ జోహైబ్ రషీద్ (పాక్) తన రూమ్ మేట్ కు చెందిన విదేశీ కరెన్సీ, విలువైన వస్తువులను తీసుకుని బస్టో అర్సిజియో పట్టణంలో అదృశ్యమైనట్లు ఆరోపణలు వచ్చాయి.

**ఒక్క పతకంతో సరిపెట్టుకున్న పాక్**

కామన్వెల్త్ గేమ్స్ 2026లో పాక్ కు ఒకే ఒక పతకం లభించింది. ఈ పోటీల్లో మొత్తం 36 మంది సభ్యులు పాల్గొనగా..మహిళల బాక్సింగ్ లో ఫాతిమా జెహ్రా కాంస్య పతకాన్ని సాధించింది.

## జెమీమా మెరుపులు వృథా..



హండ్రెడ్ వుమెన్ కాంపిటీషన్ లో సదరన్ బ్రేవ్ వుమెన్ తొలి ఓటమిని చవిచూసింది. సోమవారం రాత్రి సదరన్ బ్రేవ్ తో జరిగిన మ్యాచ్ లో వెల్ష్ ఫైర్ తో ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన సదరన్ బ్రేవ్ వుమెన్ 100 బంతుల్లో 5 వికెట్ల నష్టానికి 121 పరుగులుచేసింది.

లారా వోల్వార్ట్ (45 బంతుల్లో 48), జెమీమా రోడ్రిగ్స్ (21 బంతుల్లో 25) రాణించారు. వెల్ష్ ఫైర్ బౌలర్లలో హెథర్ గ్రహమ్, గ్రేస్ పాట్స్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం వెల్ష్ ఫైర్ నిర్ణీత వంద బంతుల్లోనే 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. వెల్ష్ ఫైర్ బ్యాటింగ్ లో టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన చోట లోయర్ ఆర్డర్ లో హెథర్ గ్రహమ్ (28 బంతుల్లో 35 నాటౌట్) అజేయంగా నిలిచి జట్టును గెలిపించింది. ఆమెకు గ్రేస్ థాంప్సన్ (16), నిమ్షా హోలండ్ (12 నాటౌట్) సహకారం అందించారు.

సదరన్ బ్రేవ్ బౌలర్లలో టిల్లీ కోర్టీన్ 3 వికెట్లు తీయగా, ఇస్సీ వాంగ్ 2 వికెట్లు తీసింది. ఈ విజయంతో వెల్ష్ ఫైర్ 5 మ్యాచ్ ల్లో రెండో విజయంతో పట్టికలో నాలుగో స్థానంలో ఉండగా, సదరన్ బ్రేవ్ ఓటమి పాలైనప్పటికీ టాప్ లోనే కొనసాగుతోంది.

# 20 గంటలు పనిచేస్తూనే ఉన్నా

**- కీర్తి సురేశ్**



ప్రముఖ నటి కీర్తి సురేశ్ తన సినిమా షూటింగ్స్ తో ఎంత బిజీగా ఉంటున్నారో తెలుపుతూ ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. కంటిమీద కునుకు లేకుండా వరుస షూటింగ్స్ లో పాల్గొన్నట్లు వెల్లడించారు.

తన వర్క్ షెడ్యూల్ ఎంత కష్టంగా ఉందో వివరిస్తూ కీర్తి సురేశ్ ఓ వీడియోను పోస్ట్ చేశారు. తీవ్ర అలసట కారణంగానే తాను ఈ వీడియోను ఆలస్యంగా పోస్ట్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ''నిన్న ఈ వీడియోను పోస్ట్ చేసే ఓపిక కూడా నాకు లేదు. ఒక షూటింగ్ నుంచి మరో షూటింగ్ కు వెళ్తూనే ఉన్నా. నిన్న ఉదయం 6 గంటలకు నా గదిలోంచి బయలుదేరాను. మళ్లీ ఇప్పుడు ఉదయం 6 గంటలు అవుతోంది. దాదాపు 24 గంటల తర్వాత నా గదిలోకి అడుగుపెట్టాను. అందులో 20 గంటల పాటు పనిలోనే ఉన్నాను. అసలు విషయం ఏమిటంటే.. మళ్లీ ఇంకో గంటలో నా తర్వాతి షూటింగ్ కోసం బయలుదేరాలి. ఇలాంటి సమస్యల గురించి ఫిర్యాదు చేయడం కూడా మంచిదే. జీవితం అంటే ఇదే కదా? దీన్ని నేను ఓ ఆశీర్వాదంగా భావిస్తున్నాను'' అని కీర్తి పేర్కొన్నారు.

శారీరకంగా ఎంత శ్రమపడినా కీర్తి సురేశ్ తన ఉత్సాహాన్ని కోల్పోలేదు. విరామ సమయంలో తీసిన ఓ మిర్రర్ సెల్ఫీని అభిమానులతో పంచుకున్నారు. అందులో ఆమె ధరించిన తెల్లటి టీషర్ట్ పై 'ఐ విల్ సర్వైవ్' (నేను నిలబడతా) అని రాసి ఉంది. దాన్ని చూపిస్తూ.. ''మళ్లీ షూటింగ్ కు వెళ్తున్నా. ఈ రోజు ఈ టీషర్ట్ పై ఉన్న అక్షరాలకు నిజమైన అర్థం దొరికింది. అవును, నేను నిలబడతా'' అంటూ సరదాగా క్యాప్షన్ ఇచ్చారు. ఇటీవల సినీ పరిశ్రమలో నటీనటుల '8 గంటల పని' గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆమె తన బిజీ షెడ్యూల్ గురించి ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకోవడం గమనార్హం.

ప్రస్తుతం కీర్తి సురేశ్ చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. 'రఫ్తార్', 'అక్క', 'రౌడీ జనార్దన' చిత్రాలతో పాటు వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్ లో వస్తున్న చిత్రంలో ఆమె నటిస్తున్నారు. ఇలా విభిన్నమైన పాత్రలతో భారతీయ వెండితెరపై ఆమె తనకంటూ ప్రత్యేక ముద్ర వేస్తున్నారు.

# ఇతరులను దూషిస్తూ బ్రతికేవారి జీవితం ఎప్పటికైనా నాశనమైపోతుంది..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ నివేదా పేతురాజ్ చివరగా 'దాస్ కా దమ్కీ' మూవీలో నటించారు. ఆ తర్వాత పూర్తిగా సినిమాలకు దూరం అయి.. తన వ్యక్తిగత జీవితానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వచ్చిన నివేదా, తన ప్రియుడు రాజ్హిత్ ఇబ్రాన్ను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకుని కుటుంబ సభ్యుల సమక్షంలో ఎంగేజ్మెంట్ కూడా చేసుకున్నారు. అయితే అనూహ్యంగా మనస్పర్థలు రావడం వల్ల, వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందే ఇద్దరూ పరస్పర అంగీకారంతో బ్రేకప్ చెప్పుకుని విడిపోయారు. అలా వ్యక్తిగత వేదనను అనుభవించిన ఈ ముద్దుగుమ్మ, ఆ బాధలన్నింటినీ పక్కన పెట్టి మళ్లీ తన దృష్టిని నటనపైనే పూర్తి ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలోనే సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించి, ఇటీవల విడుదలైన 'సింగ్ గీతం' అనే చిత్రంతో బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన బ్లాక్బస్టర్ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ విజయంతో మళ్లీ ఫుల్ ఫామ్లోకి వచ్చిన నివేదాకు వరుసగా క్రేజీ ఆఫర్లు తలుపు తడుతున్నాయి. ప్రస్తుతం ఆమె చేతిలో ఆదర్శ కుటుంబం, మెగాస్టార్ ప్రాజెక్ట్ మెగా-158, రామ్ పోతినేని 'రాపో-23' వంటి అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ చిత్రాలు ఉన్నాయి. ఇలా బ్యాక్ టు బ్యాక్ పెద్ద సినిమాల షూటింగ్లతో ఒకవైపు రాత్రింబవళ్లు ఫుల్ బిజీగా గడుపుతూ, తన కెరీర్ను సరైన దారిలో పెడుతున్న సమయంలోనే ఆమె ఒక ఊహించని ట్విస్ట్ ఇచ్చారు.



తాజాగా తన ట్విట్టర్ ఖాతాలో ఓ క్రిప్టిక్ పోస్ట్ను షేర్ చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. 'బ్రతికి ఉన్నంత కాలం నీతిగా, నిజాయితీగా జీవించి చనిపోయినా మంచి పేరే మిగులుతుంది. కానీ, ఇతరులను నిందిస్తూ, మనసులో ఒకటి పెట్టుకుని పైన ఇంకొకటి నటిస్తూ బ్రతికితే.. ఆ జీవితం ఎప్పటికైనా నాశనమైపోతుంది' అనే అర్థం వచ్చే ఒక శక్తివంతమైన వ్యాఖ్యాన్ని ఆమె షేర్ చేశారు. నివేదా నుండి సడెన్గా ఇలాంటి పోస్ట్ రావడం చూసి అభిమానులు, నెటిజన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ పోస్ట్ వెనుక ఉన్న అసలు కారణమేమై ఉంటుందనే దానిపై నెట్టింట రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. గతంలో నిశ్చితార్థం రద్దయి విడిపోయిన తన మాజీ ప్రియుడిని ఉద్దేశించి, అతడి ప్రవర్తనపై విసుగు చెంది ఆమె ఈ వ్యాఖ్యలు చేశారా? లేక ఇటీవల కాలంలో సినీ నటీమణులను లక్ష్యంగా చేసుకుని డీప్ఫేక్ ఫొటోలు, అసభ్యకరమైన వీడియోలు సృష్టిస్తూ డిజిటల్ వేధింపులకు గురిచేస్తున్న సోషల్ మీడియా కేటుగాళ్లకు హెచ్చరికగా ఈ పోస్ట్ పెట్టారా? అంటూ సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. వరుస సినిమాలతో సక్సెస్ ట్రాక్లో ఉన్న సమయంలో నివేదా పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం హాట్ టాపిక్గా మారింది.

## అందుకే శూర్పణఖ పాత్రను అంగీకరించా



ఈ మధ్య కాలంలో 'దే దే ప్యార్ దే 2', 'పతి పత్నీ ఔర్ వో దో' లాంటి చిత్రాలతో ప్రేమికురాలిగా తెరపై మెరిసింది నాయిక రకుల్ ప్రీత్ సింగ్. ఇప్పుడామె మునుపెన్నడూ చేయని శూర్పణఖ అనే కొత్త పాత్రతో 'రామాయణ' సినిమాలో అలరించడానికి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఓ అభిమాని 'మీరీ పాత్రను అంగీకరించడానికి కారణమేంటి?' అని అడగ్గా.. దీనికి సామాజిక మాధ్యమాల వేదికగా బదులిస్తూ.. ఓ పోస్ట్ పెట్టింది రకుల్. ''శూర్పణఖ పాత్రను ఒప్పుకోవడానికి కారణం ఆమెలోని సంక్లిష్టత. చరిత్ర తరచుగా ఆమెను కేవలం ఒకే ఒక్క ఘట్టం ద్వారా మాత్రమే గుర్తుంచుకుంటుంది. కానీ ఆమె కథ వెనుక అంతకు మించి ఎన్నో విషయాలు దాగి ఉన్నాయి. ఒక నటిగా ప్రేక్షకుల్లో ఇప్పటికే ఉన్న పాత ఆలోచలను, అభిప్రాయాలను మార్చేలా ఉండే వైవిధ్యమైన పాత్రలు చేయడం నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. అందుకే ఈ ఛాలెంజింగ్ పాత్రకు ఒకే చెప్పా. 'రామాయణ' థియేటర్లలోకి వచ్చినప్పుడు ప్రేక్షకులు ఈ శూర్పణఖ పాత్రను ఒక కొత్త కోణంలో, విశాలమైన మనసుతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా'' అని ఆ పోస్ట్ లో పేర్కొంది.

## ఆ గోల్డెన్ అవకాశాన్ని కోల్పోయినందుకు నేను ఇప్పటికీ బాధపడుతున్నా: శ్రీను వైట్ల

టాలీవుడ్ దర్శకుడు శ్రీనువైట్ల యాక్షన్, కామెడీ చిత్రాలు తెరకెక్కించి పలు హిట్స్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన చార్మింగ్ స్టార్ శర్వానంద్ తో కలిసి ఒక భారీ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్ టైనర్ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రతిష్టాత్మక సినిమాను ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర తన ఏకే ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు గ్రాండ్ గా పూర్తి కాగా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభించబోతున్నట్లు టాక్. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

ఇదిలా ఉంటే, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీను వైట్ల, తన సినీ కెరీర్ లో ఒక గోల్డెన్ అవకాశాన్ని వదులుకుని ఇప్పటికీ ఎంతో బాధపడుతున్నట్లు తెలుపుతూ ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. 'నేను 2011 లో కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ గారిని ప్రత్యేకంగా కలిశాను. అప్పటికే ఆయన నేను తెరకెక్కించిన 'దూకుడు' సినిమా చూశారు. ఆ మూవీ ఆయనకు బాగా నచ్చడంతో, నేను స్వయంగా దర్శకత్వం వహిస్తే ఆ చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేయడానికి ఆయన ఎంతో ఆసక్తి చూపించారు. కానీ అప్పటికే నేను యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో 'బాద్షా' సినిమాకు అంగీకరించి ఉండటం, పైగా నాకు తమిళ భాషపై పెద్దగా పట్టు లేకపోవడంతో ఆ సువర్ణావకాశాన్ని కోల్పోయాను. అంతటి స్టార్ హీరోతో పనిచేసే అవకాశం చేజారడంపై నాకు ఇప్పటికీ చాలా బాధగా అనిపిస్తుంది' అని శ్రీను వైట్ల వెల్లడించారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.